www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
ఆదివారం 12 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 225 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## ఓర్వలేకనే బురద రాజకీయాలు

- అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 11:** ప్రజల మన్నలను పొందుతూ పార్టీలకతీతంగా కృషి చేస్తుంటే ఓర్వలేక కంది శ్రీనివాస్ రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నాడని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు విశ్వసించరని నీ గురించి నీ వ్యవహార శైలి నచ్చకనే ప్రజలు నిన్ను తిరస్కరించారని ఆయన అన్నారు 30 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్నానని ప్రజలకు జవాబుదారీగా ఉన్న నాయకులు 2 లో..

## నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల చివరిన శంకుస్థాపన

- సీఎం రేవంత్ రెడ్డి



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 11:** హైదరాబాద్ నగరంలో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించబోయే ఉస్మానియా ఆసుపత్రికి 2 లో..

## మద్యం కంపెనీల ఎంపిక పారదర్శక విధానంలో జరగాలి

- సీఎం రేవంత్

- సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు

( రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 11:** రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అన్నారు.ఎక్సైజ్ శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ,ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి శని వారం 2 లో..

## నాగార్జున సాగర్ లో ముగిసిన ఆదివాసీ. గిరిజన ప్రజాప్రతినిధుల శిబిరం

- కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి వెంకట్ రెడ్డి లు
- ఆదివాసీ, గిరిజనుల ప్రజాతినిధులు



2 లో..

# కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపండి
# మీవెంట మేం ఉంటాం





- ప్రభుత్వ భవనాలు, మంచి పనులు చేయాలంటే సర్కార్ భూములే లేకుండా చేశారు
- జిల్లాకు నవోదయ స్కూల్ మంజూరు కాబోతోంది
- వేములవాడను ప్రసాద్ స్కీం కింద చేర్చబోతున్నాం
- ఈ ప్రాంత అభివృద్ధి కోసం అవసరమైన నిధులను కేంద్రం నుండి తెచ్చేందుకు యత్నిస్తా
- గతంలో నన్ను ఏ కార్యక్రమాలకు పిలవలేదు
- ఎప్పుడైనా పిలిస్తే..ఆ అధికారిపై బదిలీ వేటు వేసే వాళ్లు
- ఇప్పుడైనా ప్రజల కోసం కలిసి పనిచేద్దాం... అభివృద్ధి సాధిద్దాం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- సిరిసిల్ల కలెక్టరేట్ లో దివ్యాంగులకు కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఉపకరణాల పంపిణీ
- సహకరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కు విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు
- గత పాలకులు ప్రశ్నించే గొంతులను నొక్కారని ఆవేదన
- మధ్యతరగతి వ్యక్తులకు అధికారమొస్తే.. పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు
- బండి సంజయ్, నేను, పొన్నం ఆ వర్గానికి చెందిన వాళ్లమే
- రాజన్న ఆలయానికి ప్రసాదం స్కీం కింద ఏటా రూ.50 కోట్లు ఇప్పించండి
- సీఎస్సార్ నిధులతో అభివృద్ధికి సహకరించండి
- నవోదయ ఇప్పించండి

2 లో..

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి శ్రీధర్ బాబు

- సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా ప్రతినిధులు. ఉన్నతాధికారులు



2 లో..

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 11:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేద వారికి లబ్ధిచేకూరే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి ని ఖండించిన కేటీఆర్



**వెలుతురు, యాదాద్రి భువనగిరి, జనవరి 11:** యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పైన కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండించిన తెరాస పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందన్నారు,ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి తెలంగాణలో 2 లో..

## అయోధ్య రామ మందిరానికి తొలి వార్షికోత్సవం

- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,జనవరి 11 ( వెలుతురు):** అయోధ్యలో కొత్త నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లాను ప్రతిష్టాపన చేసి ఏడాది కావొస్తోంది. ఈ నేపథ్యంలో తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎక్స్ అకౌంట్‌లో ఆయన పోస్టు చేస్తూ.. భారతీయ 2 లో..

## గ్రీన్‌కో ప్రాజెక్టుతో తీరనున్న విద్యుత్ సమస్య

- పిన్నాపురం ప్రాజెక్టు ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి
- ప్రత్యక్షంగా 10వేలమందికి..పరోక్షంగా 40వేలమందికి ఉపాధి
- ఐటి తరవాత గ్రీన్ ఎనర్జీపై సిఎం చంద్రబాబు దృష్టి
- అటవీ,రెవెన్యూ శాఖల మధ్య భూసమస్యలపై దృష్టి
- ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించిన డిప్యూటి సిఎం పవన్



9 లో..

## కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిస్తున్నారు

- ఫార్ములా కేసులో అవినీతి అన్నది ఎసిబి, ఇడి తేలస్తాయి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ఖమ్మం,జనవరి11( వెలుతురు):** కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిసతున్నారని, ఆయనకు ఎలా బుద్ది చెప్పాలో వారికి తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిఎంను తిడుతూ వాడుతున్న భాష ఆయన దిగజారుడు రాజకీయాన్ని సూచిస్తోందన్నారు. మా ప్రభుత్వం ఏ ఒక్కరి మీద కక్ష్యపూరితంగా చర్యలు చేపట్టడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కారు రేసింగ్ లో చట్టం తన పని తానే చేసుకుని పోతుంది.. కేటీఆర్ 2 లో..

## మరింత పడిపోయిన రూపాయి విలువ

- ప్రధాని మోడీ సమాధానం చెప్పాలన్న ప్రియాంక



**న్యూఢిల్లీ,జనవరి11( వెలుతురు):** అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా పడిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. శుక్రవారం రూపాయి విలువ ఒక్కసారిగా 16 పైసలు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల చివరిన శంకుస్థాపన



సంబంధించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. దప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు వివరించిన మ్యాప్‌లలో ముఖ్యమంత్రి పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పారు. ముఖ్యంగా రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు,

# కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపండి మీవెంట మేం ఉంటాం

- కలిసి అభివృద్ధి చేసేందుకు మేం సిద్ధమన్న ఆది శ్రీనివాస్
- అవకాశముంటే మిడ్ మానేరు నుండి విజయవాడ కు సీ ప్లేన్ మంజూరు చేయించాలని సంజయ్ కు ఆది వినతి
- అధికారం ఉంటేనే కలెక్టరేట్ కు వస్తాం లేకుంటే కలెక్టర్ ను వేధిస్తామని చెప్పే వాళ్లకు బుద్ధి చెబుతాం
- ఆక్రమించిన స్థలంలో పార్టీ ఆఫీస్ పెడితే చర్యలు తీసుకుంటే తప్పేంటి?
- దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ



**కరీంనగర్ జిల్లా వెలుతురు జనవరి 11:**
"రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను మళ్లీ కోరుతున్నా... పేదల భూములను కబ్జాలు చేసినోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కుపాదం మోపండి. మీ వెంట నాతోసహా వేల మంది అండగా ఉంటారు. ఈ విషయంలో మీరు ముందుకు పోవాలని కోరుతున్నా" అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర యంత్రాంగాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలంటే, మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా పోయాయని, గత బీఆర్ఎస్ పాలకులు, కేసీఆర్ కుటుంబం ధరణి పేరుతో ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ చేశారని మండిపడ్డారు. అట్లాంటి వారిని ఉపేక్షించొద్దని, బుల్డోజర్లు దించాలని కోరారు.

శనివారం రోజున సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన దివ్యాంగులకు ఉప కరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, స్థానిక మున్సిపల్ ఛైర్మన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే....

ఈరోజు సమాజంలో అన్ని అవయవాలు ఉన్న మనమే అనేక సమస్యలకు సతమతమవుతున్నాం. ఇగ దివ్యాంగుల ఇబ్బందులు వర్ణణాతీతం. కానీ దివ్యాంగుల మనో నిబ్బరం, ధైర్యం గ్రేట్. మీకు మేం చేయాల్సిందల్లా అండగా ఉండటమే. నీతి నిజాయితీ ఉన్నోళ్లు వారు.

కేంద్ర ప్రభుత్వం ADIP (Assistance to Disabled Persons), రాష్ట్రీయ వయోశ్రీ యోజన (RVY) పథకాల కింద ఈరోజు 69 లక్షల 54 వేల 911 రూపాయల విలువైన 675 పరికరాలను ఈరోజు 322 మంది దివ్యాంగులకు అందించడం చాలా సంతోషంగా ఉంది.

వీటిలో 87 బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్స్, 85 సాధారణ ట్రైసైకిల్స్, 126 BTE హెయిరింగ్ ఎయిడ్స్, 80 వీల్ చైర్స్, 127 వాకింగ్ స్టిక్స్ తోపాటు వివిధ సహాయక కిట్లు, CP కుర్చీలు, ఇతర ప్రత్యేక పరికరాలు కూడా పంపిణీ చేస్తున్నం.

రెండేళ్ల క్రితం ఈ జిల్లాలోనే 1930 మంది దివ్యాంగులకు 2 కోట్ల 33 లక్షల 47 వేల 768 రూపాయల సమసవిలువైన పరికరాలను పంపిణీ చేసిన విషయం నాకింకా గుర్తుంది. అట్లాగే కరీంనగర్ జిల్లాలో కూడా గతేడాది పెద్ద క్యాంపు నిర్వహించి 750 మందికిపైగా కోట్ల రూపాయల ఖర్చు చేసి పరికరాలు అందించినం.

కేవలం నాలుగేళ్లలోనే నా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులు, మహిళలు, వృద్దుల సంక్షేమం కోసం 100 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసినం. దివ్యాంగుల, వృద్దుల ఆశ్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిదులు మంజూరు చేస్తోంది.

రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా కలిసి ముందుకు పోవాలని భావిస్తున్నా. దారి తప్పుతున్నోళ్లను దారికి తెచ్చేందుకు యత్నిస్తా. నేను 5 ఏళ్లలో ఎన్నడూ కలెక్టరేట్ కు రాలేదు. ఏ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఎందుకంటే గతంలో నన్ను ఏ కార్యక్రమానికి పిలవలేదు. కలెక్టరేట్ కు వెళితే.. వెంటనే బాధ్యులను బదిలీ చేసే వాళ్లు... అందుకే గతంలో ఒక ఎమ్మెల్యే కలిసి ప్రోగ్రాం పెడతామంటే... మ్యూజిక్ ప్రోగాం పెడదామా? అని వ్యంగ్యస్త్రాలు విసిరా.

ఇప్పుడు ఆ పార్టీ నేతలు కలెక్టర్ ను దూషిస్తున్నరు. అధికారులను పట్టుకుని తిడుతున్నరు. అటెండర్ నుండి కలెక్టర్ కావాలంటే కష్టపడి చదివి రావాలి.

కలెక్టర్ గారు... ఎమ్మెల్యేలారా... బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలన్నీ స్వాధీన పర్చుకోండి. గతంలో ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేసి దోచుకుంటామంటూ చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేం. పొట్టొడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోచమ్మ కొడతదనే సంగతి గుర్తుంచుకోవాలి.

నేను మళ్లీ కోరుతున్నా... పేదల భూములను కబ్జాలు చేసిటోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కుపాదం మోపండి. మీ వెంట వేల మంది అండగా ఉంటారు. ఎందుకంటే ప్రభుత్వ భవనాలకు, మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా చేశారు. ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నరు. ఒక కుటుంబమే ఎక్కువగా లాభపడ్డది. ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ పరం చేశారు. ఇకపై అట్లా జరగడానికి వీల్లేదు.

సిరిసిల్ల జిల్లాలో నవోదయ స్కూల్ త్వరలో మంజూరు కాబోతోంది. ఆ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినం. గతంలో ప్రసాద్ స్కీం కింద నిధులిస్తాం ప్రతిపాదనలు పంపాలని కోరితే నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మేం ప్రతిపాదనలు పంపిన వెంటనే పంపారు. అతి త్వరలోనే వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతాం.

నేను ఎంపీగా, కేంద్ర మంత్రిగా గెలిచానంటే మీరు పెట్టిన భిక్షే. మీరు గెలిపిస్తేనే ఈ స్థాయికి వచ్చిన. కలిసి పనిచేస్తా. కేంద్రం నుండి అవసరమైన నిధులన్నీ తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు యత్నిస్తా.

నా లక్ష్యం ఒక్కటే. నా పార్లమెంట్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి పరికరాలివ్వాలి. వాళ్లను అన్ని విధాలా ఆదుకోవాలి. మనసులో వారికి ఏ బెంగ లేకుండా రోజువారీ జీవితం గడిచేలా చేయాలన్నదే నా సంకల్పం. అందుకే నా పార్లమెంట్ పరిధిలో పరికరాలు అందకుండా ఇంకా ఎవరైనా దివ్యాంగులు మిగిలి ఉంటే వాళ్ల జాబితా కూడా రడీ చేయండి. వాళ్లందరికీ పరికరాలు అందించే ఏర్పాట్లు చేద్దాం. ఈ జిల్లాలో ఇకపై ఏ ఒక్క దివ్యాంగుడి నోటి నుండి నాకు పరికరం అందలేదనే మాట రావొద్దు.

(మొదటి పేజీ తరువాయి..)

## ఓర్వలేకనే బురద రాజకీయాలు

హుందాగా వ్యవహరించాలని ఆయన అన్నారు, అదిలాబాద్ లో నా ఇల్లు తప్ప అన్ని భూములు కబ్జా చేసినట్లుగా ఆరోపించారంటేనే అందులో ఎంత నిజముందో అర్థం అవుతుందని ఆయన అన్నారు, అక్రమంగా ఆస్తులు కూడా పెట్టుకున్నారని అనడంలో అర్థం లేదని కష్టపడి ఆస్తులు సంపాదించుకోవడం కూడా తప్పేనా అని ఆయన ప్రశ్నించారు, ఎన్నికల సమయంలో జోగు రామన్న నేను ఒకటే అని దుష్ప్రచారం చేసిన ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించారని ఆయన అన్నారు, బీసీ బిడ్డగా రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేక దురుద్దేశంతో అవమానించే రీతిలో మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు, అదిలాబాద్ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జిల్లా మంత్రి సీతక్కను కలిస్తే తప్పేంటి వాళు తనకిచ్చే గౌరవాన్ని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు, లక్షలమంది భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహా యాగాన్ని సైతం రాజకీయం చేయడం మంచిది కాదని ఆయన సూచించారు కంది చేసిన మోసాల గురించి వివిధ ఛానళ్లు ప్రసారం చేశాయి, ప్రజా ప్రతినిధులు హుందాగా విలువలకు కట్టుబడి ఉండాలని ఆయన అన్నారు, సాత్నాల ఇరిగేషన్ కోసం ఉంచిన భూమిని కబ్జా చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఉత్తరం రాశారు. ఇరిగేషన్ కు సంబంధించిన స్థలంలో భూ కబ్జా చేశారు. మూడేళ్ళ కిందటి ఖాళీ భూమి ఉంది. అవసరమొస్తే మేము మాట్లాడే మాటలకు బయట తిరగలేరు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడే ఉండాలన్న ఉద్దేశంతో. అఫిడవిట్ లో తప్పులు ఉన్నాయని కూడా ఆరోపించారు. హైకోర్ట్ లో కేసు ఉండే. నేను ఎక్కడైనా తప్పు చేసినట్లు ఉంటే పూర్తి విచారణ జరపాలి. చీప్ జిమ్మిక్కు మాత్రమే. పదేళ్ల కిందట నాకున్న కంపెనీలలో షేర్ల గురించి అఫిడవిట్ లో రాశాము. నా చుట్టుపక్కల ఉన్నవారికి భూములు ఉండొద్దా అని ప్రశ్నించారు. పత్రిక మిత్రులకు స్థలాలు ఇవ్వడం తప్పా...చచ్చినా బతికినా బీజేపీ పార్టీలో ఉంటానని ప్రగల్భాలు పలికి ఏడాదిలోనే పార్టీ మారారు. రాజకీయంగా బురద జల్లాలన్న ఉద్దేశ్యంతో పదవ తరగతి మాత్రమే ఉన్నాను అని నేను. డిగ్రీ పరీక్షలు రాస్తేనే సర్టిఫికెట్ వచ్చింది. మంత్రి అయ్యాక సీతక్క ఎల్ ఎల్ బి పరీక్ష రాశారు. ఆమెది కూడా తప్పేనా. మేము మాత్రమే రాజకీయాలు చేయాలని చూస్తే చరిత్ర క్షమించదు. సామాన్య కుటుంబం నుండి వచ్చాను. ముఖ్యమంత్రి మాట్లాడినా ఓర్వలేక పోతున్నారు. రాజకీయాల్లో హుందాగా ఉండాలని నోరు జాగ్రత్తగా అదుపులో పెట్టుకుని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు. జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం నాయకులు ఆదినాద్. నగేష్ రత్నాకర్ రెడ్డి రమేష్ వేణుగోపాల్. లాలా మున్నా ఆకుల ప్రవీణ్ .సోమరవి. జోగు రవి రాజేష్ రఘుపతి శ్రీనివాస్ సుభాష్ దయాకర్. రాష్ట్ర పాల్ బోయర్ విజయ్ భీమ్బంద్ రెడ్డి రవి రెడ్డి వేద వ్యాస్ మహేందర్.. తదితరులు ఉన్నారు

## నాగార్జున సాగర్ లో ముగిసిన ఆదివాసీ. గిరిజన ప్రజాప్రతినిధుల శిబిరం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 11:**
స్వాతంత్ర పోరాటం కోసం వెనుకడుగు వేయని ధీరోదాత్తులు ఆదివాసీలు, గిరిజనులు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో హక్కులు కాదు మాట్లాడే స్వేచ్ఛను కోల్పోయామని ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని ఆయన తెలిపారు, గిరిజనుల కోసం తెచ్చిన పీసా, అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు, అటవీ సంపదలో గిరిజనులకు అన్ని హక్కులు ఇందిరమ్మ రాజ్యంలో వస్తాయని ఆయన పేర్కొన్నారు, ఐటీడీఏలకు పునర్జీవం కల్పిస్తాం. కావలసిన బడ్జెట్ కేటాయిస్తాం. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధిని కల్పిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు, నాగార్జునసాగర్ లో ఏర్పాటుచేసిన ఆదివాసి, గిరిజన ప్రజా ప్రతినిధుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,ఏఐసీసీ ఎస్సీ ఎస్టీ ఓబీసీ , మైనార్టీ కో ఆర్డినేటర్ కొప్పుల రాజుతో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు,

## అయోధ్య రామ మందిరానికి తొలి వార్షికోత్సవం

సంస్కృతి, ఆధ్యాత్మికతకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నో శతాబ్ధాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంశంలో ఈ దివ్య, భవ్య అయోధ్య రామాలయం దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

## మద్యం కంపెనీల ఎంపిక పారదర్శక విధానంలో జరగాలి

(మొదటి పేజీ తరువాయి..)

సమీక్షించారు. ఇప్పటికే తెలంగాణ బివరేజెస్ కార్పొరేషన్ (TGBCL) కు సరఫరా చేస్తున్న కంపెనీలు కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ఆయా కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని, కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరగాలని చెప్పారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిన విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని, పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఏడాదిగా ఎక్సైజ్ శాఖ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తుండగా, గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను క్రమంగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సుకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసన సభ్యులు పార్లమెంటు సభ్యుల సూచనలను అభిప్రాయాలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఎంపిక చేయుటలో ప్రణాళిక బద్ధకంగా అమలు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామస్థాయిలో మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను వార్డు వద్ద ఉండే విధంగా చూడాలని, గ్రామసభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతంలో టామ్ టామ్ వేయించాలని తెలిపారు. రాబోయే ఉగాది నుండి పౌర సరఫరాల దుకాణాలలో సన్నబియ్యం ఇవ్వటానికి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన తెలియజేశారు. గ్రామస్థాయి, మున్సిపల్ స్థాయిలో పర్యటించే బృందంలో వ్యవసాయ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ప్రతినిధులు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లోభూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడుతలుగా 12,000 అందజేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అవకాశం ఇవ్వాలని అన్నారు. శాసన సభ్యులు సూచించిన విధంగా అర్బన్ ప్రాంతంలో గాని రూరల్ ప్రాంతంలో గాని ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే రెండో విడతలో రాజీవ్ స్వగృహ మాదిరిగా 10 అంతస్తుల భవన సముదాయం నిర్మించి ఇల్లులేని వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు ఎంపికలు 2014 జిఓ ప్రకారం అర్హత గల వారికి వచ్చే విధంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అన్నారు. వ్యవసాయ యోగ్యంకానీ భూములను నిర్ధారించి, రాళ్లు రప్పలు ఉన్న భూములను గుర్తించి, వ్యవసాయం సాగు చేయబడే భూములకు మాత్రమే రైతు భరోసా అందే విధంగా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూఈ నాలుగు పథకాలకు సంబంధించి ఈ నెల 11 నుండి 13 వరకు షెడ్యూలు తయారు చేయడం జరిగిందని, 16 నుండి 20 వరకు ఆయా శాఖల బృందాలు లబ్ధిదారులలో అర్హులను గుర్తించి 21 నుండి 24 వరకు ఆయా గ్రామసభల్లో మున్సిపల్ వార్డులలో లిస్టులను ఉంచడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ యోగ్యం భూములను గుర్తించాలని, కొత్త రేషన్ కార్డులు ఎంపికలు బృందాలుగా వెళ్లి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనిలో 2023-24 సంవత్సరంలో జాబ్ కార్డులు కలిగిన వారిని ఎంపిక చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు శాసన సభ్యులు కొంత మంది రైతులకు రుణమాఫీ రాలేదని, సన్నబియ్యం బోనస్ 500 రూపాయలు కొన్ని ప్రాంతాలలో బ్యాంకుల నుండి రైతులకు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో జమ కాలేదని తెలుపగా దానిపై స్పందించిన మంత్రి వెంటనే లీడ్ బ్యాంక్ అధికారికి వివరాలు ఇచ్చి ఆ రైతుల ఖాతాలో జమ అయ్యే విధంగా చూడాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, అరికె పూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్స్ కమీషనర్ కె.శశంక,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మూడు జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి ని ఖండించిన కేటీఆర్

గుండారాజ్యం చలాయిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు, భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల్ని పంపి దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు, ఎన్నుకున్న ప్రజలతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాల పైన దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారనీ కేటీఆర్ హెచ్చరించారు పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గుండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీమరోసారి నిరూపించుకుంటోంది. మా పార్టీ కార్యకర్తల, నాయకుల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని కేటీఆర్ హెచ్చరించారు,వెంటనే బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలతో పాటు, వారి వెనుక ఉన్న జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు .

## మరింత పడిపోయిన రూపాయి విలువ

86.04కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. 'చరిత్రలోనే తొలిసారిగా రూపాయి మారకం విలువ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో డాలరుతో రూపాయి మారకం విలువ 58-59 గా ఉండేది. అప్పట్లో నరేంద్ర మోదీ రూపాయి విలువను ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపెట్టేవారు. డబ్బు విలువ ఏ దేశంలోనూ ఇంతగా పడిపోదని, అంతా తనకే తెలుసని చెప్పేవారు. మరి ఇప్పుడేమైంది. ఆయనే ప్రధానిగా ఉన్నారు. పతనంలో రూపాయి రికార్డులు సృష్టిస్తోంది. రోజు రోజుకూ దాని విలువ పడిపోతోంది. అందువల్ల దేశ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

## కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిస్తున్నారు

సీఎం రేవంత్ రెడ్డినీ లొట్టపీస్ ముఖ్యమంత్రి అన్నారు ఆయన బాషకు నమస్కారం.. ఆయన మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారు.. విచారణ కాకుండా ఈ ప్రభుత్వం ఏ ఒక్కరినీ అరెస్టు చేయదు.. అది బండి సంజయ్ కి కూడ బాగా తెలుసు.. విచారణ లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని అరెస్ట్ చేయరు.. ఏసీబీ రంగంలోకి రాగానే ఈడీ ఎంటర్ వచ్చింది.. స్టేట్ గవర్నమెంట్ పొల్యూట్ అయిందంటే కేంద్ర ప్రభుత్వం కూడా ఈడీ కూడా ఎందుకు రంగంలోకి వచ్చింది.. అందులో అవినీతి జరిగిందని రుజువైంది కాబట్టి ఈడీ రంగంలోకి వచ్చింది అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతికి ముందే అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేని వారు ఎవరో రెచ్చగొడితే వాళ్ల మాటలు విని మీరు అభద్రతకు లోనూ కావొద్దని చెప్పుకొచ్చారు. అలాగే, ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఇక, రైతు బంధు ఇవ్వలేదని, ఇళ్లు ఇవ్వలేదని మాజీ ముఖ్యమంత్రి టీం దుష్ప్రచారం చేస్తుంటుంది.. వారి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు అని చెప్పారు. అలాగే, యోగ్యమైన భూమి ఉన్న వారందరికీ రైతుబంధు అందిస్తాం.. కానీ, రియల్ ఎస్టేట్ భూములకి మాత్రం ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం చెల్లించదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇక, రైతు బంధు విషయంలో ఎవరు అభద్రతకు లోనూ కావొద్దు అందరికీ ప్రభుత్వ పథకాలు వస్తాయని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపుల్లో ప్రత్యర్థులు రెచ్చగొట్టే చర్యలకు మీరు లోనూ కావద్దు.. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టి వదిలేసిన అన్ని ఇండ్లని పూర్తి చేసి ప్రజలకి అందిస్తాం.. మొదటి విడతగా 3,500 ఇస్తున్నాం.. గ్రామ కమిటీలో అర్హులైన వారికి ఇల్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.




కొండపోచమ్మ సాగర్ లో ఐదుగురు యువకుల అకాల మృతిపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన బండి సంజయ్. యువకుల అకాల మరణం అత్యంత బాధాకరం సెల్ఫీల కోసం తొందరపాటు చర్యలకు పాల్పడి ప్రాణాలు కోల్పోవద్దు. మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చవద్దు, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరిన బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు జనవరి 11:**

# ఇబ్రహీంపట్నం నియోజక వర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గారిని కలిసిన మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు

**తుర్కయంజాల్ వెలుతురు జనవరి 11:**
మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు శనివారం రోజున ఇబ్రహీంపట్నం నియోజకవర్గంమల్ రెడ్డి రంగారెడ్డి గారిని వారి నివాసంలో కలిసి మాసబ్ చెరువు పైన జరుగుతున్న కబ్జాల గురించి వివరించడం జరిగింది. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మల్ రెడ్డి రంగారెడ్డి మాసబ్ చెరువు పరిరక్షణ సమితి చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా అక్కడికి విచ్చేసి మేము అధికారంలోకి వచ్చాక ఎట్టి పరిస్థితుల్లో ఎఫ్టిఎల్ బఫర్ జోన్లను గుర్తించి వాటి స్థానంలో కబ్జా గురైన మాసబ్ చెరువు ను కాపాడుతానని హామీ ఇవ్వడం జరిగింది ఈరోజు అదే విషయాన్ని గుర్తు చేస్తూ మాసబ్ చెరువులో జరుగుతున్న అక్రమాలను వెలికి తీయాలని కోరడం జరిగింది ఎమ్మెల్యే మాట్లాడుతూ అందులో ఎలాంటి అక్రమ నిర్మాణం చేపట్టిన సహించే లేదని ఎట్టి పరిస్థితుల్లో వాటిని తొలగిస్తామని ఆయన హామీ ఇవ్వడం జరిగింది ఎమ్మెల్యే గారిని కలిసిన వారిలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, కళ్యాణ్ నాయక్ చెరువు పరిరక్షణ సమితి చైర్మన్ శ్రీ బచ్చిగళ్ళ రమేష్ కమిటీ సభ్యులు అడ్వకేట్ k.అరుణ్ కుమార్ వడ్డేమోని అజయ్ గౌడ్ వీరేశం చక్రధర్ తదితరులు పాల్గొన్నారు



# కొండ పోచమ్మ ప్రాజెక్ట్ లో 5 గురు మృతి చెందడం పట్ల మంత్రి ప్రభాకర్ విచారం



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 11:**
సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టు లో ఐదుగురు యువకులు గల్లంతైన సంఘటన తీవ్ర ఆందోళనకు గురి చేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ఘటనపై సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తో మంత్రి ప్రభాకర్ మాట్లాడారు,అధికారులు వేగంగా సహాయక చర్యలు కొనసాగించాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించి . ప్రాజెక్టుల వద్దకు ఈతకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు, అలాగే ఈ ఘటన పైన అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు, అలాగే కొండపోచమ్మ సాగర్ లో గల్లంతై హైదరాబాద్ కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరగకుండా ఉండేందుకు జలాశయాల వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కవిత సూచించారు.

# యువకుల మృతి ఘటనపై కవిత దిగ్భ్రాంతి



**హైదరాబాద్,జనవరి11( వెలుతురు):**
సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరగకుండా ఉండేందుకు జలాశయాల వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు ఇవాళ ఉదయం కొండపోచమ్మ సాగర్ చూసేందుకు వచ్చారు. అక్కడ చాలాసేపు సరదాగా గడుపుతూ వీడియోలు తీసుకున్నారు. ఈ క్రమంలో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నిస్తుండగా వారంతా డ్యామ్‌లో పడి గల్లంతయ్యారు. ఇది గమనించిన స్థానికులు వారిని రక్షించే ప్రయత్నాలు చేశారు. కానీ అప్పటికే ఐదుగురు యువకులు మరణించారు. మిగిలిన ఇద్దరిని సురక్షితంగా కాపాడగలిగారు.

# నేటినుంచి పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,జనవరి11( వెలుతురు):**
సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్, స్కాట్‌లాండ్, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ప్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివెల్ ఉంటుందన్నారు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రాచీన కట్టడాలను, దేవాలయాలను పరిరక్షించాల్సి ఉందన్నారు. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు.

# త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

- పార్టీలో పనిచేసిన వారికే పదవులు
- సంక్రాంతి తరవతా మంత్రివర్గ విస్తరణపై స్పష్టత
- దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,జనవరి11( వెలుతురు):**
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల




భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

# సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

- భువనగిరి బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి
- కాంగ్రెస్ దాడిని ఖండించిన కెటిఆర్, హరీష్ రావు

**భువనగిరి/హైదరాబాద్,జనవరి11( వెలుతురు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై భారాస భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని భారాస కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారాస కార్యాలయంపై దాడి చేసి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఇదిలావుంటే యాదాద్రి భువనగిరి జిల్లా భారాస పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం



పేరుతో అధికారంలోకి వచ్చి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని ఆక్షేపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న భారాస కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ.. అరాచకాలకు చిరునామాగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారాస కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలతో పాటు వారి వెనకున్న నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 'ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాడులు చేసే సంస్కృతిని ఎక్కువైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడి చేస్తే, ఆ పార్టీ నాయకులు భౌతికదాడులకు పాల్పడుతున్నారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ ప్రజాపాలన?' అని హరీశ్ రావు ప్రశ్నించారు.

# తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

- 27న హాజరుకానున్న రాహుల్, ఖర్గే

**హైదరాబాద్,జనవరి11( వెలుతురు):**
కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.



మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. 'సంవిధాన్ బచావో' ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు.

# కనౌజ్‌లో ఘోర ప్రమాదం

- కూలిన నిర్మాణంలో ఉన్న రైల్వే పైకప్ప

**లక్నో,జనవరి11( వెలుతురు):**
ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. కన్నౌజ్ రైల్వే స్టేషన్ లో నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద కనీసం 20 మంది చిక్కుకుని ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. ఇప్పటివరకు ఆరుగురిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం రెండో అంతస్తులో ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు.

# సంపాదకీయం..

## జాతిని జాగృతం చేసిన స్వామి వివేకానంద !

భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందిది. ఆయన ఎప్పుడూ యువతను మేల్కొల్పుతూనే ఉంటారు. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే 'డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు'వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా 'గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని' దేనికి భయపడవద్దని అంటారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను' అని స్వామిజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను 'నేషనల్ యూత్ డే' గా జరుపుకుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగు తుంది. జీవితానికి అసలైన అర్థం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేయడం ద్వారా భారత కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. యువత తమ తెలివితేటలతో ఆధునిక భారత నిర్మాణానికి పూనుకోవడం ద్వారానే ఆయనకు నివాళి అర్పించగలదు.. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్దాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఆయనే. తూర్పు దేశాల తత్త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో 1893 లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారత దేశం వచ్చిన వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ఇంతటి ఘనత సాధించిన స్వామి వివేకానంద కేవలం ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది. వివేకానందుడు తన సందేశంలో భారతదేశ మత సామరస్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి వివరించాడు. ప్రాచీన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో దాడులు ఎదుర్కొన్న నుంచి ఇజ్రాయెలీలు, పార్సీలు వంటివారిని స్వీకరించి హృదయాలకు హత్తుకున్న భారతదేశానికి చెందినవాడినని గర్విస్తున్నానన్నాడు. వివిధ మార్గాల ద్వారా సాగిన మానవులంతా భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పే హిందూ సూక్తులను, భగవద్గీత శ్లోకాన్ని ప్రస్తావించాడు. చారిత్రకంగా ఎన్నో నాగరికతలు, దేశాలను నాశనం చేసిన మూఢభక్తి, మతతత్వాలను సర్వమత సమ్మేళనం దూరం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పాడు. తరవాత రామకృష్ణ పరమహంస సాహచర్యలో జీవితం గడిపాడు. రామకృష్ణ పరమహంస నుంచి నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు. కుటుంబ కష్టాలను ఈడుస్తున్న సమయంలోనే 1886లో రామకృష్ణ పరమహంస మరణించారు. రామకృష్ణులవారు చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవారు. వాళ్ళకి నరేంద్రుడు నాయకుడిగా ఉండేవారు. కొంతకాలం తరువాత వివేకానంద దేశమంతటా పర్యటించాలనుకున్నారు. భారతదేశమంతటా ప్రయాణించి భారతీయుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసారు.ఆ సమయంలో పేదవాళ్ళ పరిస్థితి చూసి చలించి పోయారు. భారత దేశం బానిసత్వంలో మగ్గిపోవడానికి, మూఢనమ్మకాలే కారణమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ మతాలను వాటి తత్వాలలను అర్థం చేసుకున్నారు. భారతీయ ఆద్యాత్మిక సందేశాన్ని ఇతర దేశాలకు అందించాలనుకున్నారు. అలా దేశమంతా పర్యటిస్తూ చివరికి కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ సముద్రంలో కొంత దూరంలో కనపడుతున్న ఒక చిన్న కొండ లాంటి ప్రదేశానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజుల పాటు ధ్యానం చేసారు. ఆ ధ్యానంలో తాను ఇన్ని రోజుల నుండి చుసిన వాటిని స్పష్టంగా అర్ధం చేసుకున్నారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించు కున్నారు. అయితే చికాగో లో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అలా షికాగో ద్వారా భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11 న తేదీన ప్రారంభమయ్యాయి. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ అయ్యి ఉంటారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో 'అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా' అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట. అప్పటి వరకు అందరు 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్' అంటూ స్పీచ్ మొదలు పెట్టారు కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులో ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్థం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారు. ఆ చప్పట్ల శబ్దం ఆగిన తరువాత ఆయన భారతదేశ గొప్పతనం గురించి మన దేశంలో ఆధ్యాత్మికత, సనాతన దర్మం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. దానితో సభ మొత్తం చప్పట్లతో మారుమోగిపోయింది. సభలో ఉన్న మేధావులు, గొప్ప గొప్ప వాళ్లంతా తమ స్థాయిని కూడా మర్చిపోయి చిన్న పిల్లల్లా ఎగబడుతూ స్టేజి వద్దకు వచ్చి స్వామీజీకి షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అప్పటి వరకు భారత దేశం అంటే, మూఢ నమ్మకాలతో, చెట్లకు పుట్లకు పూజలు చేసే ఒక అనాగరికమైన దేశం అనే భావన ఉన్న వాళ్లందరికీ భారత దేశం పట్ల ఉన్న అపోహలను తొలగించారు. గౌరవం కలిగేలా చేసారు. భారత దేశపు స్థాయిని పెంచారు. ఆ తరువాత కూడా చాలా కాలం పాటు దేశమంతా పర్యటిస్తూ ప్రసంగాలు చేస్తూ, రామకృష్ణ మఠాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. 1902 సంవత్సరం జులై 4 తేదీన రాత్రి 9 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు.

# "లేండి, మేల్కొనండి , గమ్యం చేరేదాక ఆగవద్దు.

## - స్వామి వివేకానంద



*నేడు స్వామి వివేకానందుని జన్మదినం. ఈ రోజును వారు చేసిన సేవలకు గుర్తింపుగా 1984 లో భారత ప్రభుత్వము వారి జన్మదినాన్ని "జాతీయ యువజన దినోత్సవం"గా ప్రకటించింది. నేడు దేశవ్యాప్తంగా వాడ వాడల్లో స్వామి వివేకానందుని జన్మదినమును జాతీయ యువజన దినోత్సవముగా గొప్పగా ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది. భారత దేశ యువత షహీద్ భగత్ సింగ్ ను, స్వామివివేకానందులవారిని గొప్పగా ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందుతారు. ఇది నిజంగా మనమంతా గర్వించదగిన విషయం.*

### స్వామి వివేకానందుని బాల్యం - విద్యాభ్యాసం:

స్వామి వివేకానందుడు కలకత్తానగరంలో విశ్వనాథ్ దత్త, భువనేశ్వరి దేవి దంపతులకు 1863 సంవత్సరం జనవరి 12 వ తేదీన జన్మించారు. బాల్యంలో వివేకానందుడిని నరేంద్రనాథ్ దత్త అని, ముద్దుగా నరేన్ అని పిలిచేవారు. దత్త కుటుంబీకులు ధనికులే గాక సంఘంలో మంచిపేరున్నవారు. దాతృత్వానికీ, విద్యాధికతకూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కాంక్షించే వారుగానూ పేరెన్నికగన్నారు. నరేంద్రుడి తాత అయిన దుర్గాచరణ్ దత్త పర్షియన్, సంస్కృతభాషలలో గొప్ప పాండిత్యాన్ని కలిగిన న్యాయవాది. కలకత్తా హైకోర్టులో విశ్వనాథ్ దత్త ఒక న్యాయవాది. అతడు ఆంగ్ల, పర్షియన్ భాషలలో గొప్ప పండితుడు. పర్షియన్ కవి అయిన హాఫీజ్ రచించిన కవితలను చదివి తన కుటుంబానికి వినిపించేవాడు. బైబిల్ గ్రంథాన్ని చదవడంలోనూ, సంస్కృతంలోని హిందూశాస్త్రాలను చదవడంలోనూ గొప్పగా ఆనందించేవాడు. మితిమీరిన దాతృత్వాన్ని, పేదలపట్ల జాలిని కలిగివున్నా మత సాంఘిక విషయాలలో హేతుబద్ధమైన, అభ్యుదయ భావాలను కలిగివుండేవాడు. బహుశా పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంవల్ల ఆయనకు ఆ గుణాలు కలిగివుండవచ్చు. స్వామి వివేకానందులవారు
రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు. వేదాంత, యోగ తత్త్వ శాస్త్రములలో సమాజముపై అత్యంత ప్రభావము కలిగించిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడు. హిందూ తత్వ చరిత్ర, భారతదేశ చరిత్రలలోనే ఒక ప్రముఖ వ్యక్తి. రామకృష్ణ మఠం, బేలూరు మఠం వ్యవస్థాపకుడు. వివేకానందుడు చిన్నప్పటి నుంచే రోజూ ధ్యానం చేసేవాడు. పుట్టగానే పువ్వు పరిమళిస్తిందన్నట్లుగా చిన్నప్పటి నుంచే అతనికి నిస్వార్థ గుణం, ఔదార్య గుణాలు అలవడ్డాయి. నరేంద్రుడు ఆటలలోనూ, చదువులో కూడా ముందు ఉండే వారు. ఏకసంధ్యాగ్రాహి. పాఠాన్ని ఒకసారి చదివితే మొత్తం గుర్తుంచుకునేవాడు. అతని జ్ఞాపకశక్తి అమోఘమైనది. 1880 వరకు మెట్రిక్యులేషన్ పరీక్ష, ప్రవేశ పరీక్ష లో ఉత్తీర్ణుడై కళాశాలలో చేరాడు. రోజు రోజుకూ అతని జ్ఞాన తృష్ణ అధికంకాసాగింది. వారు నిరంతరము దైవం గురించి తెలుసుకోవాలని జిజ్ఞాసతో ఉండేవాడు. చరిత్ర, సైన్సు తోపాటు పాశ్చాత్య తత్వశాస్త్రాన్ని కూడా ఔపోసన పట్టాడు. అలా చదువులో ముందుకెళుతున్న కొద్దీ అతని మదిలో అనుమానాలు, సందేహాలు, అస్పష్టత ఎక్కువ కాసాగినాయి. అలా మూఢ నమ్మకాలన్నింటినీ విడిచిపెట్టినప్పటికీ సత్యాన్ని మాత్రం కనుగొనలేకపోయాడు. నరేంద్రుడు తనకు వచ్చిన సందేహాలన్నీ అనేక పండితుల ముందు వెలిబుచ్చాడు. వారంతా వాదనలలో ఆరితేరిన వారు. కానీ వారి వాదనలేవీ నరేంద్రుడిని సంతృప్తిపరచలేకపోయాయి.

### చికాగో సర్వమత మహాసభ:

అమెరికాలోని చికాగోలో 1893 సంవత్సరం సెప్టెంబర్ 11 న తేదీన సర్వ మత మహా సభలు(పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రెలిజియన్స్) ప్రారంభమయ్యాయి. ఈ సర్వ మత మహా సభలకు వివేకానందుడు పాల్గొన్నాడు. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ వచ్చారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో "అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా!" అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట. అప్పటి వరకు అందరు "లేడీస్ అండ్ జెంటిల్ మెన్" అంటూ స్పీచ్ మొదలు పెట్టారు. కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులోని ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్థం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారట. ఆ చప్పట్ల శబ్దం ఆగిన తరువాత ఆయన భారతదేశ గొప్పతనం గురించి మన దేశంలో ఆధ్యాత్మికత, సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. దానితో సభ మొత్తం చప్పట్లతో మారుమోగిపోయింది. సభలో ఉన్న మేధావులు, గొప్ప గొప్ప వాళ్లంతా తమ స్థాయిని కూడా మర్చిపోయి చిన్న పిల్లల్లా ఎగబడుతూ స్టేజి వద్దకు వచ్చి స్వామీజీకి షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు.
స్వామీజీ కృషి వల్ల ఒక్క అమెరికాలోనే కాకుండా అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ భారతదేశం పట్ల గౌరవం ఏర్పడింది. అతను ఎక్కడ ఉపన్యాసం ఇవ్వడానికి వెళ్ళినా జనం గుమికూడి ఎంతో ఓపికగా ఎదురుచూసేవారు. ఉపన్యాసం అయిపోయిన తరువాత ఆయనను తమ ఇళ్ళకు ఆహ్వానించి ఆదరించేవారు. ఇంగ్లాండు నుంచి కూడా ఆయనకు ఆహ్వానం లభించింది. ఆయనకు అక్కడ ఘనస్వాగతం లభించింది. ఎంతోమంది ఆయనకు శిష్యులయ్యారు. వారిలో ముఖ్యులు సిస్టర్ నివేదిత గా మార్పు చెందిన మార్గరెట్ నోబుల్. తరువాత ఆమె భారతదేశానికి వచ్చి ఇక్కడే ఉండిపోయింది.
నాలుగు సంవత్సరాల పాటు విదేశీ పర్యటన తరువాత స్వామీజీ తిరిగి భారతదేశానికి విచ్చేశాడు. తిరిగి వచ్చేసరికి ఆయన కీర్తి దశదిశలా వ్యాపించిపోయింది. తిరిగి భారత దేశం వచ్చి రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు.

### ముఖ్యసూత్రములు తత్వములు:

వివేకానందుడు గొప్ప తాత్వికుడు. అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్త్వ శాస్త్రములోనే కాకుండా, సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుంది. రామకృష్ణుడు నేర్పిన ముఖ్యమైన పాఠాలలో 'జీవుడే దేవుడు' అనేది అతని మంత్రముగా మారింది. 'దరిద్ర నారాయణ సేవ' (పేదవారి సేవతో భగవంతుని సేవ) అనే పదాన్ని ప్రతిపాదించాడు. "విశ్వమంతా బ్రహ్మం నిండి ఉండగా మనము మనని గొప్ప వారని తక్కువ వారని ఎలా అనుకుంటాము?" అనే ప్రశ్న తనకు తాను వేసుకుని ఈ తేడాలన్నీ మోక్షము సమయములో కలిగే దివ్యజ్యోతిలో కలిసి పోతాయని తెలుసుకున్నాడు. అప్పుడు పుట్టే ప్రేమ నుండి, తమలోని బ్రహ్మన్ని తెలుసుకోలేని మనుష్యులను ఆదుకునే సత్ప్రవర్తన పుడుతుంది అన్నాడు. అందరు తనవారనుకుంటేనే నిజమైన స్వేచ్ఛ లభిస్తుందనే వేదాంత తత్వానికి చెందిన వ్యక్తి వివేకానందుడు. వ్యక్తిగత మోక్షము పై వ్యామోహమును కూడా వదిలివేసి, ఇతరులను బంధవిముక్తులను చెయ్యడమే మనిషికి జ్ఞానోదయము అని నమ్మిన మనిషి. రామకృష్ణ మిషన్ (రామకృష్ణ మఠము) ను "వ్యక్తి మోక్షమునకు, ప్రపంచ హితమునకు" అనే నినాదము మీద స్థాపించాడు. సిద్ధాంతాలు, పిడివాదాలు, సంప్రదాయాలు, దేవాలయాలు మున్నగువాటిని గురించి ఆలోచించకు అన్నాడు.

### వివేకానందుని బోధనలు:

ఆధ్యాత్మిక శక్తిని సముపార్జించండి. ఇతర ధర్మాలను నిందించవద్దు. ప్రతి మతంలోను, ప్రతి సిద్ధాంతంలోను, ఎంతోకొంత మంచి వుంటుంది. సోదర ప్రేమ గురించి వృథ ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శించండి. త్యాగము, సాక్షాత్కారాలను పొందినవాడే ప్రపంచంలోని సర్వమతాలలోని ఏకత్వాన్ని దర్శించగలడు. వృథ వాదాలకు ఆస్కారం లేదని గ్రహింపగలడు. అపుడే మానవాళికి సహాయం చేయగలడు. వాస్తవానికి అన్ని మతాలు ఒకే సనాతన ధర్మం యొక్క అంశాలు అని చెప్పాడు. స్వామీ వివేకానందుడు జీవించిన కాలంలో ఉన్న హిందూమతంలోని అపసవ్య ధోరణులను వ్యతిరేకించి సర్వమత సమానత్వాన్ని బోధించిన గొప్ప సంస్కరణ వాది. స్వామి వివేకానందుడు దేశ యువతకు ఎన్నో దివ్య ప్రబోధాలను అందించారు. అవి సంక్షిప్తంగా ఇక్కడ వివరిస్తున్నాను.

**గమ్యం చేరేవరకు ఆగవద్దు. జాగృతులు కండి.**
**ఉవ్వెత్తున ఉప్పొంగే ఉప్పెన తీవ్రతను ఎవరూ నిరోధించలేరు.**
**ఆవేశపూరితులు కండు, ప్రేమతత్వాన్ని వీడవద్దు. విశ్వాసాన్ని, నమ్మకాన్ని, సడలనీయకండి.**
**భయం విడనాడండి. భయమే పెద్ద పాపం.**
**ఆరంభం అతి స్వల్పంగా ఉందని నిరాశపడవద్దు. ఘనమైన ఫలితాలు క్రమంగా సమకూరుతాయి.**
**సాహసాన్ని ప్రదర్శించండి.**
**మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు.**
**ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.**
**కెరటం నాకు ఆదర్శం .. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా కూడా లేస్తున్నందుకు.**
**మతం అనేది సిద్ధాంత రాద్ధాంతాలలో లేదు. అది ఆచరణలో, ఆధ్యాత్మికులుగా పరిణతి చెందడంలో మాత్రమే ఉంది.**

### వివేకానందుని నిర్యాణం:

దేశవ్యాప్తంగా పర్యటించడం, అవిశ్రాంతంగా పని చేయడం వలన వివేకానందుని ఆరోగ్యం దెబ్బతిన్నది. అమెరికాలోని అతని శిష్యుల అభ్యర్థన మేరకు మరల అక్కడికి వెళ్ళాడు. ప్యారిస్ లోని సర్వమత సమావేశాలలో పాల్గొని తిరిగి స్వదేశానికి వచ్చాడు. రానూ రానూ అంతర్ముఖుడయ్యాడు. శరీరమైతే బలహీనంగా తయారయ్యింది కానీ అతను ఆత్మ, మనసు మాత్రం చాలా చురుగ్గా వ్యవహరించేవి. అట్లా జులై 4, 1902న యథావిధిగా అతను రోజూవారీ కార్యక్రమాలు నిర్వర్తించుకుంటూనే నిర్యాణం చెందారు. అట్లా ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించిన వివేకానందుడు హిందూమత ప్రాశస్త్యం గురించి అవిశ్రాంతంగా కృషి చేసి భారతీయులకు అత్యంత అప్తుడయ్యాడు. వారు చేసిన సేవలకు గుర్తింపుగా 1984 లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని "జాతీయ యువజన దినోత్సవం"గా ప్రకటించింది.



వ్యాసకర్త:
**ఇంజమూరి రఘునందన్,**
సెల్: 9865102962
టిటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు

# స్మార్ట్ ఫోన్ల నుంచి ల్యాప్ టాప్ ల వరకు ఐటీ హార్డ్ వేర్ తయారీలో భారత్ ముందంజ

*భారతీయ కంపెనీ సిర్మా ఎస్ జి ఎస్ కు చెందిన అత్యాధునిక ల్యాప్ టాప్ అసెంబ్లింగ్ యూనిట్ ను చెన్నైలో ప్రారంభించిన శ్రీ అశ్విని వైష్ణవ్*

**చెన్నై వెలుతురు 11 జనవరి 2025:**
భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఒక అద్భుతమైన పరిణామంగా, కేంద్ర ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వే, సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ చెన్నైలో సిర్మా ఎస్ జి ఎస్ టెక్నాలజీ సంస్థ కు చెందిన అత్యాధునిక ల్యాప్ టాప్ అసెంబ్లింగ్ యూనిట్ ను ప్రారంభించారు.దమద్రాస్ ఎక్స్ పోర్ట్ ప్రాసెసింగ్ జోన్ (ఎంఇపిజెడ్) లో ఏర్పాటయిన ఈ యూనిట్ భారతదేశ 'మేక్ ఇన్ ఇండియా' ప్రయాణంలో కీలక మార్పును సూచిస్తుంది, మొబైల్ ఫోన్‌ల తయారీలో సాధించిన ఆధిక్యాన్ని ఇప్పుడు ఐటీ హార్డ్‌వేర్, ముఖ్యంగా ల్యాప్‌టాప్‌ల తయారీలోకి విస్తరిస్తోంది.

### 'మేక్ ఇన్ ఇండియా'లో మైలురాయి

ఈ కొత్త అసెంబ్లింగ్ యూనిట్ ప్రారంభంలో సంవత్సరానికి 100,000 ల్యాప్ టాప్ లను ఉత్పత్తి చేస్తుంది. రాబోయే 1-2 సంవత్సరాలలో ఈ సామర్థ్యాన్ని 10 లక్షల యూనిట్ల వరకు పెంచే అవకాశం ఉంది. సిర్మా ఎస్ జి ఎస్ ప్రస్తుతం చెన్నైలో నాలుగు తయారీ యూనిట్లను నిర్వహిస్తోంది, దాని మూడవ యూనిట్ ఇప్పుడు ల్యాప్‌టాప్‌ల ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, "రానున్న కాలంలో ఎలక్ట్రానిక్ విడి పరికరాల తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కూడా మనం సంకల్పంతో పని చేయాలి. ఇది భారతదేశానికి ఒక ప్రధాన వృద్ధి కథను నడిపించడమే కాకుండా ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది, స్వావలంబనను ప్రోత్సహించి ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో మన స్థానాన్ని బలోపేతం చేస్తుంది" అన్నారు



## కెపిహెచ్బి కాలనీ కల్చరల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు...



**కూకట్ పల్లి జనవరి 11 వెలుతురు:**
కెపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్ స్పోర్ట్స్ అసోసియేషన్, శేరి మమతా సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పీజేఆర్ జ్ఞాపకార్థం శనివారం కేపీహెచ్బీ కాలనీలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఆరు వరకు ఉత్తమమైన ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు ప్రధానం చేశారు. అంతేకాకుండా ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు గిఫ్ట్ బాక్స్ లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రేష్మ, లక్ష్మి, జోజమ్మ, మారుతి, తమ్మినేని ప్రవీణ్ కుమార్, సంజీవరావు, రాజేష్ గౌడ్, ఫణింద్ర కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జర్నలిస్టులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు...

- సద్వినియోగం చేసుకోవాలని కోరిన టి యు డబ్ల్యూ జే జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు...



**కూకట్ పల్లి జనవరి 11 వెలుతురు:**
జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. బండారు అస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుశ్రుత్ పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది జర్నలిస్టు వృత్తిపరమైన ఒత్తిడిలకు లోనై గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా ఈసీజీ, 2డి ఈకో, ఆర్ బి సి లతోపాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. వివేకానంద నగర్ లోని బండారు ఆసుపత్రిలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. జర్నలిస్టులు దీనిని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలను చేయించుకోవాలని కోరారు.

# కొండకల్ తండా గిరిజన రైతుల రిలే నిరాహార దీక్ష

- భూముల కబ్జా, అక్రమాలపై పోరాటం
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ , స్థానిక తహసీల్దార్ హయాం లో భూ కుంభకోణం
- 2000 కోట్ల కుంభకోణం, అవినీతి కి పాల్పడిన దొంగ దొరలు



**శంకర్ పల్లి వెలుతురు జనవరి 11**
శంకర్పల్లి మండల పరిధిలోని కొండకల్ తండా గ్రామం గిరిజనులు, వారి పూర్వీకుల భూములను ఆక్రమించి, అన్యాయంగా కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ ఘటన నందు, గిరిజనులు గత ఏడు తరాలుగా పంటలు పండించి, జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, అపర్ణ ఉదయ్ కుమార్ రెడ్డి, ఎస్.ఎస్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, గ్రీన్ మార్క్ కళ్యాణ్ రెడ్డి, అరబిందో ఫార్మా నిత్య నంద రెడ్డి కలిసి 80 ఎకరాల భూమిని అతి చురుకుగా కబ్జా చేసినట్లు తెలుస్తోంది. గిరిజనులు ఈ భూములపై తమ హక్కులను నిలబెట్టుకోవడానికి పోరాటం చేస్తూ, దాడులకు, గుండాల దాడులకు గురవుతున్నట్లు తెలిపారు.భూములు ఆపత్తిలో ఉన్నప్పటికీ, గిరిజనుల తరఫున పోరాటం చేయడానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి, జిల్లా ఎస్టీ గిరిజన అధ్యక్షుడు, జిల్లా సీపీఐ పార్టీ అధ్యక్షులు పాల్గొని ఈ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. 80 సంవత్సరాలుగా తాము సాగు చేస్తున్న భూమిని ప్రైవేటు వ్యక్తుల వరం చేస్తున్నారని శంకరపల్లి మండలం కొండకల్ తండా గ్రామస్తులు ఆరోపణ. మా భూములు మాకే కావాలి అని ఉద్దేశంతో గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొండకల్ వెలిమల శివారులోని 80 ఎకరాల జిల్లా దాఖల భూముల సర్వేనెంబర్ 633 634 635 636 637 638 639 640 641 642 643 644 ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూ అక్రమాలకు అపర్ణ గ్రీన్ మార్క్ రియల్ ఎస్టేట్ కంపెనీల అపర్ణ ఉదయ్ కుమార్ రెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, కొమ్మారెడ్డి విక్రమ్ కుమార్ రెడ్డి, గ్రీన్ మార్క్ కళ్యాణ్ రెడ్డి, అరబిందో ఫార్మా నిత్యానంద రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ



చట్ట ప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో జీవన విధానాన్ని కొనసాగిస్తున్న గిరిజన రైతుల భూములను కొందరు భూబకాసురులు కబ్జా చేసుకోవడం సిగ్గు చేటు" అని నిరసన వ్యక్తం చేశారు. ఈ అక్రమణకు సంబందించి అధికారులు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, పటాన్చెరు మండల తహశీల్దార్, స్థానిక పోలీస్ స్టేషన్లపై తీవ్ర విమర్శలు కూడా చేశారు. అందరినీ ఆక్రమణకు గురిచేస్తున్న విక్రమ్ రెడ్డి, ఇది మాత్రమే కాదు, 1985 లో తలారి ఎల్లయ్య



(లేట్) కు కర్మఖండ చేసిన సుభద్ర బాయి దేశ్ముఖ్ అత్త వెంకటమ్మ యొక్క భూములు కూడా కబ్జా అయ్యాయి. 115 సర్వే నెంబర్లో ఉన్న 2 ఎకరాల భూమిని ఉచితంగా గిరిజన కుటుంబానికి ఇచ్చినా, విజయవంతంగా విక్రమ్ రెడ్డి అదే భూమిని బలవంతంగా ఆక్రమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శంకర్ నాయక్, రవి నాయక్, గిరిజన సంఘాలు , గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రీమ్స్ స్కూల్ లో ఘనంగా సంక్రాంతి సంబురాలు..



**వెలుతురు, సిటీ కల్చరల్:**
చిన్ననాటి నుంచే పిల్లలకు మన పండుగలు, పర్వదినాల విశిష్టత తెలియజెప్పాలని అంబర్ పేట డ్రీమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగో పాల్ అన్నారు. అంబర్ పేటలోని డ్రీమ్స్ కిడ్స్ అప్పర్ ప్రై మరీ స్కూల్ లో శనివారం సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భం గా విద్యార్థులు సాంప్రదాయ దుస్తు ల్లో సందడి చేశారు. రైతులు, హరి దాసులు, జంగమయ్య వేషధార ణలతో చూపరులను ఆకట్టుకున్నా రు. విద్యార్థులకు సాంస్కృతిక ప్రద ర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయ బృందం, చి న్నారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆల్విన్ కాలనీలో క్రిస్మస్ ఫీస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్...



**కూకట్ పల్లి జనవరి 11 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషి గుడా లోని ఫుల్ గస్పెల్ చర్చ్ లో తెలంగాణ ప్రభుత్వం సహకారంతో పాస్టర్స్ అందరూ కలిసి నిర్వహిస్తున్న క్రిస్మస్ ఫీస్ట్ (విందు) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, ఉమేష్, పాస్టర్స్ ఇస్రాయిల్, ఏసురాజు, సత్య రాజు, ఫిలిప్, విద్యాసాగర్, దేవదాస్, నాగభూషణం, కోకిల శామ్యూల్, సంతోషమ్మ, పద్మమ్మ, సుమన్, శ్యాముల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలను, దౌర్జన్యాలను ఎదిరించిన స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న

**వడ్డే ఓబన్న 218వ జయంతి సందర్భంగా రవీంద్ర భారతిలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న బీసీ నేత లింగంగౌడ్**





**హైదరాబాద్ వెలుతురు జనవరి 11:**
స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న 218వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఆయన చరిత్ర చిరస్మరణీయమన్నారు. వడ్డే ఓబన్న విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజం నిర్మాణం కోసం కృషిచేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ పాల్గొన్నారు.

KOMPALLY
SURAKSHA
Women & Children Hospital
GENERAL PEDIATRICS | OBSTETRICS & GYNAECOLOGY | PEDIATRIC LAPAROSCOPIC SURGERIES
LEVEL III NICU & PICU | PEDIATRICS INTENSIVE CARE UNIT | NEONATAL INTENSIVE CARE UNIT
CRITICAL CARE OBESTETRICS & GYNAECOLOGY | 24/7 LABORATORY & PHARMACY | 24/7 AMBULANCE
FOR APPOINTMENTS
040 2666 6666, 888 666 8026

Suraksha
Super Speciality Hospital
24/7 CRITICAL CARE TEAM | 24/7 CT SCAN | DIALYSIS | 24/7 LABORATORY & PHARMACY
24/7 AMBULANCE | 100 BEDDED CAPACITY | FULLY EQUIPPED OPERATION THEATRES
30 BEDDED MICU & SICU | DELUXE, SEMI DELUXE, A/C WARDS
FOR APPOINTMENTS
040 26 108 108, 7240 108 108

# చేనేత అభయహస్తం నేతన్నలకు ఎంతో మేలు జరుగుతుంది: కడారి బిక్షం

● సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**సూర్యాపేట వెలుతురు జనవరి 11:**
168 కోట్లతో చేనేత అభయ హస్తం ద్వారా నేతన్నలకు పొదుపు, భద్రత, భరోసా పథకాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలపడం అర్హనీయమని సూర్యాపేట చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కడారి బిక్షం అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చేనేత సహకార సంఘంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని చేనేత, జౌళి కార్మికులకు ఈ అభయ హస్తం పథకం ద్వారా అభివృద్ధికి భరోసా కలుగుతుందని అన్నారు. నేతన్న పొదుపు నిధి కింద 115 కోట్లు, నేతన్న భద్రతకు 9 కోట్లు, నేతన్న భరోసా కు 44 కోట్లు కేటాయించడం చాలా సంతోషకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపిన వెంటనే చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కు ఉత్తర్వులు జారీచేసి మా నేతన్నలకు ఇది సంక్రాంతి కానుక ఇచ్చారు అని సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేతన్నలకు మేము అండగా ఉన్నామని మరోసారి నిరూపించారు అని తెలిపారు. చేనేత అభయ హస్తం పొదుపునిది, భద్రత ,భరోసా మూడు పథకాలకు ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి,



తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జౌళి శాఖ ఉమ్మడి జిల్లా ఏడి ద్వారక్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, అలాగే సూర్యాపేట జిల్లా చేనేత సహకార సంఘం శిథిలావస్థకు చేరుకుందని దీనిని పునర్నిర్మాణానికి మాజీ మంత్రివర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహాయ సహకారాలతో పునర్నిర్మాణానికి అవకాశం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ప్రధాన కార్యదర్శి చిలువేరు నరసింహారావు, కోశాధికారి బాల్నే మల్లయ్య, సంఘ నాయకులు నాగుల శ్రీనివాస్, ముశం హరి, యలగందుల సాయినేత, సంగిశెట్టి ఆంజనేయులు, మోత్కూరి, మధు ముషం వెంకటనారాయణ, రుద్ర దామోదర్, యలగందుల లక్ష్మయ్య, జెల్ల శివాజీ, సూరపల్లి మార్కండేయ, భీమనపల్లి వెంకటేశ్వర్లు జెల్లా సూర్యం తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లను తక్షణమే విరమించుకోవాలి

## - ఎం సాయిబాబా.




**వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 12**
రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వివిధ వృత్తులలో పనిచేస్తున్నారని వారి సంక్షేమాన్ని తుంగలోకి తొక్కే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలు సరైనవి కాదని సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు ప్రభుత్వాలను హెచ్చరించారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ ఇండియా సిఐటియు ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడెల వల్ల రానిన రోజుల్లో కార్మికులకు అన్యాయం జరుగుతుందని రాష్ట్రంలో కోడులను అమలు చేయాలని చూస్తే కార్మికులు పోరాటానికి సిద్ధమవుతారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో వివిధ రూపంలో వెల్ఫేర్ బోర్డు మార్పులను చేస్తూ బోర్డు నిధులను విచ్చలవిడిగా అప్డేట్ పేరుతో ఖర్చు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, రాష్ట్రంలో నూతన విధానాన్ని తీసుకొచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాల దరఖాస్తులకు నిధులు తక్షణమే విడుదల చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికునికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు మేటర్నిటీ మ్యారేజ్ దహన సంస్కారాలకు ఇచ్చే 30 వేలను లక్ష రూపాయలకు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి 6000 రూపాయలు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రామ్మోహన్ రావు, ఆర్ కోటంరాజు ,వర్కింగ్ ప్రెసిడెంట్ ముదం శ్రీనివాస్ ,కోశాధికారి యల్క సోమయ్య గౌడ్, సిహెచ్ లక్ష్మీనారాయణ, అనంతల మల్లయ్య, సోములు ,లక్ష్మయ్య, ఉప్పలయ్య ,గాలయ్య, జంగయ్య, సాగర్ ,రాములు, నాగేశ్వరరావు ,రమేష్ ,బాలాజీ నాయక్ ,రాజేశ్వరి ,సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీలను ప్రారంభించిన బండారి వెంకన్న, చిలువేరు సమ్మయ్య గౌడ్







**కేసముద్రం వెలుతురు జనవరి 11:**
బేరువాడ గ్రామంలో శనివారం ఏకలవ్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథులుగా పిఎసిఎస్ చైర్మన్ బండారు వెంకన్న, కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ లు హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ బండారి వెంకన్న మాట్లాడుతూ క్రీడలు యువతకు మానసిక ఉల్లాసం తో పాటు ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడతాయని, యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మంచి మార్గం వైపు నడవడానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ యువతలో ఉన్న క్రీడా విజ్ఞానాన్ని తెలుసుకొని వారిలో ఉండే క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి,యువతకు క్రీడా స్ఫూర్తిని అందచేయడం కొరకు, వారిలో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుటకు ఉపయోగపడే విధంగా ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లా స్థాయి కబడ్డీ షటిల్ డాన్స్ పోటీలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని ఏకలవ్య యూత్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేరువాడ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు జూకంటి బాల కొమరయ్య,ఎర్రం శెట్టి అశోక్,ముదిగిరి చిన్న సాంబయ్య, రామకృష్ణ పబ్బతి ప్రశాంత్ గౌడ్,కొండేటి కళాధర్,ఏకలవ్య యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న బుద్ధిస్ట్ సైట్ చిత్రకళా ప్రదర్శన

**వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 12**
చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ లో ప్రముఖ చిత్రకారుడు శిరంశెట్టి ఆనంద్ ఏర్పాటు చేసిన ఫణిగిరి బుద్ధిస్ట్ సైట్ చిత్రాలు ఎందరో చిత్రకళ అభిమానులను,ప్రముఖులను ఆకర్శిస్తున్నాయి ఆలోచింప చేస్తున్నాయి. 2వేల సంవత్సరాలక్రితం బుద్ధ చరిత్రపై 6నెలలు శ్రమించి 100 కు పైగా చిత్రాలు వేసి ప్రముఖుల సమక్షంలో ఆర్ట్ ప్రదర్శన, ఆర్ట్ పుస్తకా విష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా నడిగూడెం రాజావారి కోట నిర్వాహకులు, ఆర్టిస్ట్ కూడా కుర్రా జితేందర్ బాబు మాట్లాడుతూ ఫణిగిరి బుద్ధ చరిత్ర చాలా గొప్పదని, తవ్వకాలు జరిపే ముందు నేను ముందున్నానని ఆనంద్ ప్రతిభ అద్భుతం అంటూ అభినందించారు.డాక్టర్, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చిత్రకళ వెలకట్టలేనిదని ఆనంద్ బొమ్మలకు పారితోసికం ఇచ్చి కొన్ని



బొమ్మలు తీసుకున్నానని ఆనంద్ ను అభినదించారు. ప్రముఖ కథా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ మా ఆనంద్ బొమ్మలు అద్భుతం అంటూ, బుద్ధుడి ప్రథమ శిష్యుడు ఆనందుడే అంటూ అభినందించారు. మరొక అతిథి గోల్డ్ మెడలిస్ట్, డాక్టర్ కృష్ణ బంటు మాట్లాడుతూ అలుపెరుగని చిత్రకారుడిగా 6నెలలు శ్రమించి బొమ్మలు వేశాడని ఆనంద్ ను అభినందించారు. తాను కుట్టిన ఊరు ఫనిగిరి, అన్న తల్లిదండ్రుల రుణం తీర్చుకున్నారని, సూర్యాపేట పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాడని ఆనంద్ ను ప్రశంసించారు. ఈ వేడుకలో ప్రముఖులు, చిత్రకారులు కాసుల పద్మావతీ, కోట ప్రసన్నజ్యోతి, అనుపోజు ప్రభాకర్, పురుషోత్తం ఎందరో ప్రదర్శన తిలకించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఫణిగిరి బుద్ధిష్టి సైట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



# ఐద్వ, డి వై యఫ్ ఐ, సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 1 1**
సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13 న నిర్వహిస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలలో మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కందుల హనుమంతు, మునికుంట్ల లెనిన్ లు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా యువతలో నైపుణ్యాన్ని, స్నేహ పూర్వక సంభంధాలను పెపొందించుటకు క్రీడలు దొహధ పడతాయాని తెలియజేసారు. ఈ నేపథ్యంలోనే రామన్నపేట మండల స్థాయి ముగ్గుల పోటీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటిల్లో గెలుపొందిన వారికీ మొదటి బహుమతి రూ. 5016/-, రెండవ బహుమతి రూ. 3,016/-, మూడవ బహుమతి 2,016/- అందజేయనున్నారు. అలాగే పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతులు ఉన్నాయని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పల్లె సత్యం, బోళ్ల వెంకన్న, గంజి అశోక్, అప్పం సంతోష్, పాల్వంచ ప్రతాప్, కుందూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

● సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



**వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 12**
జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సిపిఎం పార్టీ రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా ఈనెల 20 నుండి 24 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జరిగే ఇంటింటికి సిపిఎం కు ప్రజలంతా సహకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక కార్మిక పోరాటాలకు నిలయమైన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభలో రాష్ట్రంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మిలు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, చేతి వృత్తుదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక తీర్మానాలు చేసినట్లు చెప్పారు. ఈ మహాసభ సందర్భంగా జనవరి 25న లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు సిపిఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ హాజరవుతున్నారని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో దేశ ప్రజానీకానికి చేసింది ఏమి లేదన్నారు. 10 సంవత్సరాల బిజెపి పాలన మహిళలకు, దళితులకు, బలహీన వర్గాలకు ముస్లిం మైనార్టీలకు రక్షణ కరువైంది అన్నారు. ఐక్యంగా ఉన్న దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు. రుణమాఫీ నేటికీ పూర్తి కాలేదని, రైతు భరోసా నిధులు విడుదల చేయలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 ఇస్తామని చెప్పిన హామీ అమలు నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎంని కలిసిన ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్



**నాగార్జునసాగర్ వెలుతురు జనవరి 11:**
నాగార్జునసాగర్ నియోజకవర్గం సాగర్ లో జరుగుతున్న ట్రైబల్ ఎంపవర్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమనికి విచ్చేసిన డిప్యూటీ సి.యం బట్టి విక్రమార్క్ కి కట్టెబోయిన అనిల్ కుమార్ ని పరిచయం చేసి గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి నియోజకవర్గంలో తాను చేపడుతున్న వివిధ సామాజిక కార్యక్రమాల గురించి వివరించిన సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఈ సందర్భంగా ఇద్దరికీ ధన్యవాదములు తెలిపారు. ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్ కుమార్

# క్రీడల తోనే మానసిక ఉల్లాసం




**గట్టుప్పల మండలం వెలుతురు జనవరి 11:** నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గట్టుప్పల మండల కేంద్రంలో జరుగుతున్నది. గట్టుప్పల్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదిన పండుగ సందర్భంగా క్రీడ మైదానంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ ప్రారంభించారు . ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ గట్టుప్పల మండల కేంద్రంలో క్రీడలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని దేనికి సంబంధించిన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని అన్నారు. మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. క్రికెట్ టు గెల్పొందిన టీముకు మొదటి బహుమతిని అందిస్తానన్నారు. గట్టుప్పల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నామని జగన్నాథం మాట్లాడుతూ మండల కేంద్రంలో క్రీడలకు సంబంధించిన ఆటో స్థలాన్ని ప్రభుత్వ అధికారులతో మాట్లాడి కేటాయిస్తానని అన్నారు. క్రికెట్ టీం సభ్యులకు రెండు జతల డ్రెస్లు ఇప్పిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు క్రీడలు మానసిక ఉల్లాసానికి



ఎంతో దోహదపడతాయని అన్నారు యువత పరిచయాలను పెంచుతుందని తెలియపరిచారు. నియోజకవర్గ స్థాయిలోని యువతీ యువకులు క్రీడల్లో రాణించినట్లైతే మావంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న యువతకు శుభాభివందనాలు తెలియపరిచారు. డాక్టర్ కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గట్టుప్పల మండల కేంద్రంలో మునుగోడు నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంటును నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలియపరిచారు. నియోజకవర్గస్థాయి యువతకు పరిచయాలు ఏర్పడతాయని తద్వారా మానవ సంబంధాలు క్రీడల ద్వారానే వృద్ధి చెందుతాయని తెలియపరిచారు. క్రీడాకారులకు మా వంతు కృషి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదగాని వెంకట్ గౌడ్ వార్డు మెంబర్లు భీమ గాని మల్లేష్ మాదగాని ఆంజనేయులు నవపురం మాజీ సర్పంచ్ భీమనపల్లి రాములు స్టార్ ప్లేయర్స్ గణేష్ గోపి గిరి మహేష్ అంజి మహేష్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతల భరోసా పథకాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి11 :** నేత కార్మికులకి భరోసా కల్పించలనే సంఖల్పము తో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతన్న ల జీవితాల్లో వెలుగులు నింపడానికి చేనేత కార్మికులకు కొరకు,తిఫ్ట్ పథకం,అభయహస్తం,నేతన్న భద్రత,నేతన్న భరోసా వంటి పథకాలను ప్రవేశ పెట్టిన సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో చేనేత కార్మికులు ర్యాలీగా వెళ్లి గ్రామ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం డైరెక్టర్లు సంగిశేటి లక్ష్మి నారాయణ,వంగర రఘు, చేనేత నాయకులు చిలుకూరి శ్రీనివాస్, సింగం కృష్ణ,గుర్రం సుదర్శన్,కర్నాటి నవీన్,గంజి రాములు,చిలుకూరు శ్రీనివాసులు,మాకం రామకృష్ణ,సింగం భాస్కర్,సంఘం మేనేజర్ వెంకటేశం, గుర్రం సత్యనారాయణ,దోర్నాల కృష్ణ, వీడేం వెంకటేష్,తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## కక్కిరేణి బ్రిడ్జిని ఇంకా ప్రారంభించరా.

- ఎదురుచూస్తున్న వాహనదారులు పట్టించుకోని అధికారులు
- వేముల సైదులు సిపిఎం నాయకుడు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 11**



గత 8 సంవత్సరాల క్రితం ఆసిఫ్ నగర్ రాస కాలువ పైన పురాతన కట్టడంతో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో దీనిపై నూతన బ్రిడ్జి నిర్మిస్తామని 2017లో కోటి 90 లక్షలతో శంకుస్థాపన చేశారు సంవత్సర కాలంలో బ్రిడ్జిని పూర్తి చేశారు. ప్రారంభించడానికి అడ్డుగా సమాధులు ఉన్నాయని గత ఐదు సంవత్సరాలుగా వాయిదా వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని... సమాధులకు (గోరీలు) బ్రిడ్జికి సంబంధించిన ఏఈ లేదా ఏడి అధికారులు స్పందించి సమాధి బాధితులను పిలిపించి పరిష్కారం చేసి వెంటనే ఈ బ్రిడ్జిని ప్రారంభించాలని ప్రజలు , వాహనదారులు కోరుతున్నారు.

## అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నా వారికి ఆర్థిక సాయం అందజేసిన మండల బీజేపీ నాయకుడు బండమీది కిరణ్



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 11 :** సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తున్నా నూకం శివగంగా భర్త జంగయ్య కుమారుడు రామ్ చరణ్ అనారోగ్యంతో ఇవ్వండి పడుతున్న విషయం తెలుసుకొని బిజెపి మండల నాయకులు బండమీది కిరణ్ కుమార్ వారి వైద్య ఖర్చులకు గాను 5000 రూ ఆర్థిక సాయం అందజేశారు చేశారు. ఈ కార్యక్రమంలో బండమీది రాజు, నక్క రమేష్ , గంజి సునీల్,ఈదుల రాకేష్,పున్న స్వామి,బొమ్మ కంటి మహేష్ కుక్కల కిరణ్,ఈదుల సతీష్,జాల నరసింహా,బొమ్మకంటి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండల అధ్యక్షున్ని సన్మానించిన బిజెపి కార్యకర్తలు

- ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి11**

నూతనంగా ఎన్నుకోబడిన బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి రామన్నపేట పట్టణ కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నియోజక వర్గ ఇన్చార్జి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకరికంటి మొగులయ్య . జిల్లా కార్యదర్శి శివకృష్ణ , జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య జిల్లా నాయకులు గునుగుంట్ల సాయన్న. నార్కట్పల్లి మండల అధ్యక్షులు కొరివి శంకర్ బిజెపి నాయకులు బట్టి రమేష్, మల్లికార్జున్ రమేష్ ,రాములు, బెల్లి లింగస్వామి, శ్రీనివాస్, శివ, గురక సైదులు, గణేష్, అజయ్ ,సురేష్ ,శివరంజన్ పున్న రమేష్, నోముల శ్రీను, భాస్కర్, సుదర్శన్, ఏనూతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కౌండిన్య గౌడ్ సత్రం పాలకమండలి కమిటీ ఎన్నిక..



**వెలుతురు, చారకొండ 11 జనవరి:** శ్రీశైలంలోని కౌండిన్య గౌడ్ సత్రం పాలకమండలి నూతన కమి టీని ఎపి, తెలంగాణ ఇతర రాష్ట్రా లకు చెందిన సభ్యులతో ఎన్నుకున్నారు. పాలకమండలి అధ్యక్షురాలు గడ్డ మీద అనురాధ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ప్రధాన కార్యదర్శిగా గుండ్ల మల్లికార్జున గౌడ్, సంయుక్త కార్య దర్శిగా మన్యం గోపి గౌడ్, ఉపాధ్య క్షులుగా గుండ్ల శివ మల్లి కార్జున గౌడ్, శ్రీని వాస్ గౌడ్, కో–శాధికారిగా ఈడిగ వెంకటేశ్వర్లు గౌడ్, సభ్యులుగా శివ శంకర్ రజనీకాంత్, బద్రీనాథ్, జ్ఞానే శ్వర్, చండీక, లక్ష్మీ నరసింహ, రవి కుమార్, అపర్ణ తదితరులతో సత్రం నూతన పాలక మండలి ఎన్నుకున్న ట్లు ఆమె వివరించారు. పాలకమం డలి సత్రం పూర్తిస్థాయి నిర్మాణం, ఇతర అంశాలపై చర్చిం చామని, సంయుక్తంగా నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తామన్నారు.

## పుచ్చకాయ పైన స్వామి వివేకానంద





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 11 :** నారాయణఖేడ్ పట్టణంలో పుచ్చకాయ పైన స్వామి వివేకానంద భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతా చాటిన స్వామి వివేకానంద జనవరి 12న జన్మించారు. ఈ పర్వదినాన్ని భారతీయులు ప్రతి సంవత్సరం జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటారు. స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు. బలమే జీవనం బలహీనతే మరణం ఈ సందర్భంగా వినూత్నంగా స్వామి వివేకానంద జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుచ్చ కాయ పైన మరియు బాదం ఆకుపైన స్వామి వివేకానంద చిత్రాలతో... గుండు శివ కుమార్ లీఫ్ ఆర్టిస్ట్ నారాయణఖేడ్.

## చేనేత కార్మికుల కోసం తెలంగాణ అభయ హస్తం పథకం రావడం హర్షనీయం



**రామన్నపేట వెలుతురు జనవరి 11:** చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అభయహస్తం పథకం అమోదించడము జరిగింది. ఇందుకు గాను 2024–2025సంవత్సరం న కు 168 కోట్లు నిధులు విడుదల చేయడం జరిగింది. తెలంగాణ అభయహస్తం పథకం లో ని అనుబంధ పథకాలు 1: తెలంగాణ నేతన్న పథకం గతం లో మాదిరిగా నే కానీ 3సంవత్సరం నుండి 2సంవత్సరం లు గా కుదించడం జరిగింది. 2:తెలంగాణ నేతన్న భద్రత ఈ పథకం లో 18సంవత్సరం ల నుండి వయసు నిమిత్తం లేకుండా 5లక్షలు వరకు బీమా చెల్లుంపు 3: తెలంగాణ నేతన్న భరోసా : ఈ పథకం లో చేనేత కార్మికుని కి సంవత్సరం న కు 18000 రూపాయలు, అనుబంధ కార్మికునికి 6000 రూపాయలు వారి యొక్క ఖాతాల లో జమ చెయ్యడం జరుగుతుంది. అంతే కాకుండా త్వరలో నే చేనేత సహకార సంఘాల బ్యాంకు క్యాష్ క్రెడిట్ అప్పు, బ్యాంకు ల లో వ్యక్తి గత రుణాలు మాఫీ చెయ్యడం జరుగుతుంది. కావున తెలంగాణ లోని ప్రతి చేనేత, పవర్ లూం కార్మికులు తెలంగాణ చేనేత సహకార సంఘాలు, చేనేత గ్రూప్ లు అందరు వారి వారి గ్రామాల లో సంఘము ల దగ్గర మన ముఖ్య మంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి, చేనేత మరియు జవ్ళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరావు కు శనివారం రోజున రామన్నపేట మండల కేంద్రంలో పద్మశాలి కాలనీలోపాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఆలాగే మన చేనేత మరియు జోళి శాఖ కమీషనర్ శ్రీమతి శైలజ రామయ్యర్ కి కృతజ్ఞతలు . ఈ కార్యక్రమం లో మాజీ ఎంపిటిసి వనం వర్షిని చంద్రశేఖర్. టెలికాటం చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు పెండం బావన, ఋషి చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గంజి అశోక్, అప్పం లింగస్వామి, సుర పెల్లి చంద్రమోహన్, గంజి గోవర్ధన్ ,చిందం ఉమాకాంతం, తొర్ర రఘు,మిరియాల, నాగార్జున రుద్ర గణేష్ గండూరి నరేష్, వనం శ్రీనివాస్, బిట్ల రమేష్, పసునూరి ధనంజయ, ఏలూరు శీను, సురపల్లి మధు, మోసం తులసమ్మ, పెండెం మనమ్మ, చెరుపల్లి శోభ,లావణ్య ,రుక్కమ్మ, దొంత రమాదేవి ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హోరహోరిగా కొనసాగుతున్న ఖిజర్ యప్పై గోల్డ్ కప్ క్రికెట్ పోటీలు ...

- క్వార్టర్ ఫైనల్ లో ఓటమి పాలైన శేఖపూర్ సీసీ, జుబేర్ అల్ ఖురేష్ ముజిబ్ సీసీ (ZHB) జట్లు...
- సెమీ ఫైనల్ కు చేరిన మస?తి సీసీ (HYD), డాలీ సీసీ (నాగపూర్ కర్నూల్ ) జట్లు..

**జహీరాబాద్ వెలుతురు జనవరి 11:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో శనివారం నాడు ఖిజర్ యప్పై గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా రెండు క్వార్టర్ ఫైనల్ మ్యాచులు జరిగాయి. ఈ రోజు జరిగిన ప్రథమ పోటీలో జుబేర్ అల్ ఖురేష్ ముజిబ్ సీసీ (ZHB) మరియు డాలీ సీసీ (నాగపూర్ కర్నూల్ ) జట్ల



మధ్య జరిగిన పోటీల్లో మొదట బాటింగ్ చేసిన డాలీ సీసీ (నాగపూర్ కర్నూల్ ) జట్టు నిర్దారిత 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జుబేర్ అల్ ఖురేష్ ముజిబ్ సీసీ (ZHB) తమ నిర్దారిత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 164 పరుగులు మాత్రమే చేసి 40 పరుగులతో ఓటమి పాలైంది. దింతో డాలీ సీసీ (నాగపూర్ కర్నూల్ ) 40 పరుగులతో విజయం సాధించి సెమీ ఫైనల్లో ప్రవేశించింది. అదేవిదంగా మధ్యాహ్నం జరిగిన రెండవ పోటీలో మస్కతి సీసీ మరియు శేఖపూర్ సీసీ జట్ల మధ్య జరిగిన పోరులో శేఖపూర్ సీసీ జట్టు మొదట బ్యాటింగ్ చేస్తూ నిర్ణిత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి185 పరుగులు చేయడంతో 186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మస్కతి సీసీ 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించి విజయం సాధించింది. దింతో మస?తి సీసీ విజయ సాధించి సెమీ ఫైనల్లో ప్రవేశించింది.

# క్రికెట్ సౌత్ జోన్ చెన్నైకి సెలక్ట్ అయిన సంస్థాన్ యువకుడు

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 11:**



సంస్థాన్ నారాయణపురం మండలం లోని వెంకంబాయి తాండ గ్రామానికి చెందినా కొర్ర సాయిరాం శుక్రవారం రోజు జరిగిన మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో క్రికెట్ క్రీడలో యూనివర్సిటీ తరపున సెలెక్ట్ అయ్యాడు. అలాగే సౌత్ జోన్ చెన్నైలో జట్టులో ఆడబోతున్నాడు. 2018 లో స్థానిక నారాయణపూర్ మండల కేంద్రంలో Zphs స్కూల్ లో ఎస్.ఎస్.సి పూర్తి చేశాడు. మండల కేంద్రంలోనిప్రభుత్వ జూనియర్ లో ఇంటర్మీడియట్ చదివాడు. డిగ్రీ నోబుల్ కాలేజ్ లో పూర్తి చేశాడు.ప్రస్తుతం Dr .ముస్కు మధుసూధన్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో బి.పి.ఎడ్ చదువుతున్నాడు.అతని తల్లిదండ్రులు కొర్ర శ్రీను విజయ యూనివర్సిటీ నుండి క్రికెట్ క్రీడకు ఎంపిక అవ్వడం చాల సంతోషాన్ని వ్యక్తం చేశారు.అలాగే గ్రామంలో ఉన్న క్రీడా మిత్రులు అభినందనలు తెలిపారు. క్రీడాకారుడు సాయి రామ్ మాట్లాడుతూ నాకు చిన్ననాటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. నాకు క్రీడలకు సంబంధించిన సహకారాన్ని అందిస్తే ఇంకా రాబోవు రోజుల్లో ముందున్న మరిన్ని సెలక్షన్ లో నా అత్యుత్తమక్రీడను ప్రదర్శితాను అని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

## వాలీబాల్ పోటీలను ప్రారంభించిన బి.ఆర్.ఎస్. నాయకుడు శివరాత్రి విద్యాసాగర్



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 11:**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మునుగోడు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఎస్.ఎన్.వి.ఎల్. 2 ను బి.ఆర్.ఎస్. నాయకుడు శివరాత్రి విద్య సాగర్ ప్రారంభించడం జరిగింది.వారు మాట్లాడుతూ శారీరక దృఢత్వం తో పాటూ మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి.మన ప్రాంతంలోని యువత మంచి నైపుణ్యం గల క్రీడాకారుగా, ఉన్న శిఖరాలకు చేరడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయి అన్నారు.ఈ కార్యక్రమంలోబి.ఆర్.ఎస్. నాయకులు నర్రి నరసింహ,జక్కిడి ధన్వంత్ రెడ్డి, చిలివేరు భిక్షం,పాండురంగ నాయక్,టోర్నీ అర్గనైజర్లు సోమనబోయిన చంద్రశేఖర్, రాచకొండ గిరి, చిలువేరు శివ కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

- సంక్రాంతి పండుగా పురస్కరించుకొని జూపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చిన జూపల్లి భాస్కరరావు



**వెలుతురు, చారకొండ 11 జనవరి :**



యువత క్రీడల్లో రాణించాలని వెల్దండ ఉమ్మడి మండల సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదిన పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని యువత గ్రామ అభివృద్ధిలో భాగ స్వాములు కావాలని ఆయన పి లుపునిచ్చారు. క్రీడా పోటీలను స్నేహపూర్వకంగా నిర్వహించు కోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ముస్తఫా, డిసిసి ఉపాధ్యక్షులు వెంకటయ్య యాద వ్, మాజీ ఎంపిటిసి నృపాల్ నాయక్, బాలరాజ్ నాయకులు రాములు యాదవ్, మాజీ సర్పంచ్ జగపతి, జంగయ్య యాదవ్, సిరాజ్, నిర్వా హకులు ప్రశాంత్ తిరుపతి మల్లేష్ తదితరులు పాల్గొన్నా రు.

# గుల్మార్గ్‌ను కప్పేసిన మంచు

- ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్న పర్యాటకులు

**శ్రీనగర్, జనవరి 11 (వెలుతురు ):**
శీతాకాలం కావడంతో హిమాలయాలకు అనుకుని ఉన్న జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో జోరుగా మంచు కురుస్తున్నది. దాంతో ఆయా రాష్ట్రాల్లోని పలు పర్యాటక ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. దాంతో పర్యాటకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. ఒకవైపు ఎండ, మరో వైపు మంచుతో కూడిన మిక్స్‌డ్ ఎన్విరాన్ మెంట్‌ను టూరిస్టులు ఆస్వాదిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో మంచు కురుస్తున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు. జోరుగా మంచు పడుతుండటంతో పరిసర ప్రాంతాలన్నీ ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. దాంతో ఇవాళ గుల్మార్గ్‌కు వెళ్లిన పర్యాటకులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు.

# బిగ్ టీవీ, అంబేద్కర్ పూలె సేవాసమితి

- ఉచిత మెగా మెడికల్ క్యాంపు ప్రారంభించిన నగేష్ షేట్కార్

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 11 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణాఖేడ్ నియోజికవర్గం నాగల్గిద్దా మండలం కారస్ గుత్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ పూలె సేవా సమితి అధ్యక్షులు రహీమ్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు ను ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షేట్కార్ రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించరు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేష్ షేట్కార్ శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా నాగేష్ షేట్కార్ మాట్లాడుతూ అంబేద్కర్ పులే సేవా సమితి పేదల అనారోగ్యంపై దృష్టి సారించింది.
ఆయా కుటుంబాలకు అండగా ఉన్నామని చెప్పడమే కాకుండా.. జిల్లాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ.. అవసరమైన వైద్యం అందించి వారికి ఆపరేషన్లు చేయించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తోంది. అనితర సాధ్యమైన ఈ సేవా కార్యక్రమాలను ప్రజలతో పాటు ప్రముఖులు ప్రశంసిస్తున్నారు అన్ని తెలిపారు. కర్ణాటక మారుమూల ప్రాంతంలో ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించినందుకు రాష్ట్ర అధ్యక్షులు రహీమ్ కి వారి బృందానికి అభినందించారు. ఈ కార్యక్రమం లో నాగల్గిద్ద



సబ్ ఇన్స్పెక్టర్ బి సాయిలు, పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్,అంబేద్కర్ పూలె సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండరి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ మాజీ జడ్పీటీసీ రూప్ షింగ్, మాజీ ఎంపీటీసీ పండరి,నారాయణ జాదవ్, సోపాన్ రావు, సంజీవ్ పటేల్ , అంబేద్కర్ పులే సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ చిస్తి,డివిజన్ అధ్యక్షుడు ఎస్ నర్సింలు, మండల అధ్యక్షుడు గణపతి,జిల్లా మహిళా అధ్యక్షురాలు దోసపల్లి యాదమ్మ న్యాల్కల్ మండల అధ్యక్షుడు నవీన్,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఎస్ లక్ష్మణ్,డివిజన్ ప్రధాన కార్యదర్శి వినోద్, డివిజన్ నాయకులు జమీర్ , డాక్టర్స్,వైద్య సిబ్బంది బిగ్ టివి ఛానల్ ఇన్చార్జి సైద్ తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ టివి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపుకు భారీ స్పందన...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 11:**
మానవసేవయే మాధవసేవగా అదొక్కటే కాకుండా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్నటువంటి మీడియా ఇప్పుడు ప్రజలు ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని బిగ్ టీవీ ఆధ్వర్యంలో బాలాజీ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోగల నెంబర్ (5) స్కూల్ ఆవరణలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పట్టణంతో పాటు నలుమూలల గ్రామాల నుండి ఈ ఉచిత క్యాంపుకు ప్రజలు వచ్చి వారి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు షుగర్ టెస్ట్ ,బీపీ, ఈసీజీ, వంటి తదితర రోగాలను పరీక్షించి వారికీ కావలసిన ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన రోగులు మాట్లాడుతూ ఇలాంటి ఉచిత




వైద్యం శిబిరాన్ని నిర్వహించిన బిగ్ టీవీ యజమాన్యానికి అలాగే బాలాజీ ఆస్పత్రి డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు బాలాజీ హాస్పిటల్ వైద్య సిబ్బంది ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు మఠం విశ్వనాథ్, మాజీ కౌన్సిలర్ రాములు నేత, బి ఆర్ ఎస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, నెంబర్ 5 పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రత్నయ్య, బి ఆర్ ఎస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, బాలాజీ ఆసుపత్రికి వైద్యులు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మోతి మాత జాతర మహోత్సవాలు

- జాతరకై పూర్తి ఏర్పాట్లు పూర్తి...
- మోతి మాత ఆలయ చైర్మన్ కేశవ్ సింగ్ రాథోడ్..



**జహీరాబాద్ వెలుతురు జనవరి 11:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం ఉప్పర్ పల్లి తండా శివారులో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవమైన మోతి మాత 30వ జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయని మోతి మాత ఆలయ చైర్మన్ కేశవ్ సింగ్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీలలో జరిగే శ్రీ మోతి మాత ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యం కోసం తాగునీరు, వైద్య ఆరోగ్య సౌకర్యాలు దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా జాతర ఉత్సవాలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వివిధ ప్రాంతాల నుంచి



భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.
పిల్లలు లేని దంపతులు ఈ దేవాలయానికి వచ్చి అమ్మవారిని మొక్కుకుంటే పిల్లలు పుడతారని గిరిజన పెద్దలు చెబుతారని, దీంతో, కొత్తగా పెళ్ళైన వధూవరులు మోతిమాతను దర్శించుకుని పూజలు చేసి ముడుపులు కడుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కేశవ్ సింగ్ రాథోడ్, వైస్ చైర్మన్ నారాయణ జాదవ్, జాయింట్ సెక్రటరీ పవన్ రాథోడ్, గౌరవ అధ్యక్షులు కిషన్ పవార్, శంకర్ నాయక్ తదితరులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మోతీమాత జాతర మహోత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు రానున్నారని వారు తెలిపారు.

# సంక్రాంతి పండక్కి ఊరేళ్ళుతున్నారా... బి కేర్ ఫుల్...

- హ్యాపీగా ఫెస్టివల్ చేసుకోండి...
- జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ ఎం కాశీ నాథ్...

**జహీరాబాద్ వెలుతురు జనవరి 11:**
సంక్రాంతి పండగ సందర్భంగా జహీరాబాద్ పట్టణ ప్రజలకు స్థానిక ఎస్ ఐ ఎం. కాశీ నాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరికి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో పోలీస్ పహారా మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రజలు సైతం తమకు సహకరించాలని కోరారు. ఊరికి వెళ్లే ప్రజలు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు విలువైన వస్తువులను తమ వెంట తీసుకుని వెళ్లాలని లేదా.. బ్యాంకు లాకర్ లో అయినా దాచి పెట్టుకోవాలని సూచించారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని.. ఇంటి పక్కన మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వారికి చెప్పడం మంచిదని, అలాగే పట్టణ పోలీస్ వాళ్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాంటి సమయంలో మేము ఆయా కాలోనిలలో పోలీస్




బందుబస్తూ నిర్వహించడానికి అవకాశం ముంటుందని సూచించారు. ఇంటి వద్ద ఒకవేళ సీసీ కెమెరాలు ఉన్న యెడల వాటిని రోడ్డు వైపు ఫేసింగ్ ఉండే విధంగా అమర్చుకోవాలని సూచించారు. జహీరాబాద్ పట్టణం ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున ఇక్కడ చోరీలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలి:**
సంక్రాంతి పండుగ సమయంలో సొంత ఊరికి వెళ్ళే తల్లిదండ్రులు కూడ తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఊరికి వెళ్ళినప్పుడు గ్రామాల్లో ఉన్న చెరువుల వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిదంగా చిన్న పిల్లలు సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలు ఎగురవేసే క్రమంలో చైనా మాంజను వాడకుండా చూసుకోవాలని, పిల్లలు మాములు దారంతో పతంగులు ఎగురవేసే విధంగా చూసుకోవాలని సలహా ఇచ్చారు. పిల్లలు బిల్డింగ్ పై నుండి గాలి పటాలు ఎగురవేసే సమయంలో కరెంటు తీగలు ఉంటాయని దాని వాల్ల కరెంటు షాకు తగిలే అవకాశం ఉందని, అదేవిదంగా బిల్డింగ్ పై నుండి క్రిందికి పడే అవకాశం ఉంటుందని కనుక అట్టి విషయమై తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చైనా మాంజకు సంబంధించి జహీరాబాద్ పట్టణ పరిధిలో ఇప్పటికే ఒక కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సంక్రాంతి పండుగను తమ తమ పిల్లలతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ప్రతి ఒక్కరికి మరొకసారి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ఉత్సవం నేడు...




**కరీంనగర్ వెలుతురు జనవరి 11:**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, కరినగర్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున సాయంత్రం 6 గంటలకు మకర సంక్రాంతి ఉత్సవ కార్యక్రమం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్లో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ హనుమండ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ గురుద్వార గ్రంధి సర్దార్ జస్బీర్ సింగ్, వక్తగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు ఆదరణీయ బూర్ల దక్షిణామూర్తి జి హాజరవుతారని పేర్కొన్నారు. హిందూ బంధువులు, స్వయం సేవకులు మకర సంక్రాంతి ఉత్సవంలో కుటుంబాలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# 52 మంది క్రీడాకారులకు టి-షర్ట్ లను స్పాన్సర్ చేసిన ఆల్మైటీ ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు ఆంగోత్ వెంకటేష్




**యాచారం వెలుతురు జనవరి 11:**
సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే క్రీడోత్సవాలలో భాగంగా తక్కళ్లపల్లి తండా గ్రామ పంచాయతీ లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ని మూడు జట్లకు గాను మొత్తం 52 మంది క్రీడాకారులకు ఆల్మైటీ ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు ఆంగోత్ వెంకటేష్ టి-షర్ట్ లను స్పాన్సర్ చేశారు, ఆయన విజ్ఞప్తి మేరకు నేను ముఖ్యఅతిథిగా హాజరవడం జరిగింది. మిగతా సభ్యులతో కలిసి క్రీడాకారులకు టి - షర్ట్స్ లను ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో క్రీడాకారులతోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోలవరం సందర్శించిన పార్లమెంట్ కమిటీ

- ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత వైకాపాకు లేదన్న మంత్రి

**ఏలూరు,జనవరి11( వెలుతురు):**



పోలవరం ప్రాజెక్ట్‌ను రాజీవ్ ప్రతాప్ రూఢ నేతృత్వంలోని 30 మంది పార్లమెంటరీ కమిటీ సభ్యుల బందం శనివారం సందర్శించింది. వారితో పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ ఈ నెలలో డయాఫ్రమ్ వాల్ కాంక్రీట్ పనులు మొదలుపెడతామని.. 2027 సెప్టెంబర్ కల్లా ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పోలవరంను 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 18 నెలలు కష్టపడి డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిస్తే దాన్ని వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మండిపడ్డారు. 2017లో పోలవరం నిర్వాసితులకు చంద్రబాబు రూ.800 కోట్ల పరిహారాన్ని అందించారని.. ఇప్పుడు మరో రూ.800 కోట్లకు పైగా నిధులను అందించారని చెప్పారు. . రాజీవ్ ప్రతాప్ రూఢీ నేతృత్వంలోని 30 మంది పార్లమెంటరీ కమిటీ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వాగతం పలికారు. గత టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశాం, వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ ను 20 ఏళ్ల వెనక్కి తీసుకు పోయింది. 18 నెలలు కష్టపడి డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని విమర్శించారు.. పోలవరంను విధ్వంసం చేసిన, నిర్వాసితులను నిర్లక్ష్యం చేసిన, డయాఫ్రమ్ వాల్ ను ధ్వంసం చేసిన జగన్ కు, వైసీపీకి పోలవరం పై మాట్లాడే అర్హత లేదన్నారు..ఇక, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ జనవరిలో డయాఫ్రమ్ వాల్ కాంక్రీట్ పనులు మొదలు పెడతాం. 2027 సెప్టెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేయాలని చంద్రబాబు ఇచ్చిన షెడ్యూల్ కు పూర్తి చేసేలా పని చేస్తున్నాం అన్నారు. గత వైసీపీ పాలనలో నిర్వాసితులకు ఒక్క రూపాయు పరిహారం అందలేదు, నిర్వాసితుల కాలనీల నిర్మాణం జరగలేదు.. బిల్లుల చెల్లింపులు జరగలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు..

# కాన్వెంట్ స్కూల్లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ అన్యువల్ డే వేడుకలు

## హాజరైన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 11:**
అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ స్కూల్లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ అన్యువల్ డే వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. పట్టణంలో విద్యాభివృద్ధికి కాన్వెంట్ స్కూల్ చేసిన కృషిని అభినందించారు. ఈ పాఠశాల చదివిన వారు ఉన్నత పదవులలో సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు














# గ్రీన్‌కో ప్రాజెక్టుతో తీరనున్న విద్యుత్ సమస్య

(మొదటి పేజీ తరువాయి..)

**కర్నూలు,జనవరి11( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రీన్ కో ప్రాజెక్టు కోసం రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారని, ఇంకా పెడుతూనే ఉన్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. భారతదేశంలో ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టారని పవన్ వెల్లడించారు. కర్నూలులో ఏర్పాటు చేసిన గ్రోన్ కో ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ రంగం తర్వాత గ్రీన్ ఎనర్జీ మీద ఫోకస్ చేస్తున్నారని, అందుకే వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఇలాంటి అద్భుతమైన ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి చెప్పారు. శనివారం కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో ప్రాజెక్టును పవన్ కల్యాణ్ సందర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్‌కో సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుకు సంబంధించి 45 హెక్టార్ల భూమి రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకే తాను వచ్చినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఆఫీసులో కూర్చుని చూడటం వేరని, ఫీల్డ్‌కి వచ్చి నేరుగా చూడటం వేరని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే తానే స్వయంగా గ్రీనో కో ప్రాజెక్టు చూసేందుకు వచ్చినట్లు పవన్ చెప్పుకొచ్చారు. గాలి, నీరు, సౌర కాంతితో విద్యుత్ తయారు చేయడంలో ప్రపంచంలోనే ఇది మొదటి అతిపెద్ద ప్రాజెక్టని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇదో గొప్ప పర్యాటక ప్రాంతం అవుతుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.12 వేల కోట్లు ఖర్చు



చేశామని, ఇంకా రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఏపీలో మూడో వంతు విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్టు తీర్చగలదని ఆయన చెప్పారు. ప్రాజెక్టు విషయంలో ఏ వివాదం ఉన్నా.. కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. అటవీ భూములు ఎంతమేర అన్యాక్రాంతం అయ్యాయనే దానిపై త్వరలో డ్రైవ్ పెడతామని ఉపముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఎన్ని ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయి, అలాగే ఇంకా ఎంతమేర మిగిలి ఉన్నాయనే విషయాలను డ్రైవ్ ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. ఆ తర్వాత తానే నేరుగా ఫీల్డ్‌లోకి దిగనున్నట్లు పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది. అందుకు నెల్లూరులో రూ. 36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది. 11.49 ఎకరాలు రైతుల నుంచి గ్రీన్‌కో కంపెనీ తీసుకుంది. గ్రీన్‌కో కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరుంది. దేశంలో రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడి పెడుతోంది. మన రాష్ట్రంలో రూ.35వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం 2,800 ఎకరాల్లో నిర్మిస్తోన్న ప్రాజెక్టు ఇది. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదు. ఈ భూమిపై రెవెన్యూ, అటవీశాఖ మధ్య చిన్న వివాదం వచ్చింది. వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం అని అన్నారు. ఇంత భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉంది. సీఎస్ఆర్ కింద పలు కార్యక్రమాలు చేయాలని కోరుతున్నా. పాఠశాలలు, సేంద్రియ సాగు, గోవుల సంతతి పెంచేలా చూడాలి. 50వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రీన్ కో కంపెనీకి ధన్యవాదాలు' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# తిరుపతి తొక్కిసలాటలో అసలు దోషి చంద్రబాబే

- సొంతవారికి పదవులు కట్టబెట్టడంలోనే బాబుకు శ్రద్ధ
- ఘాటు విమర్శలు చేసిన మాజీమంత్రి రోజా

**తిరుపతి,జనవరి11( వెలుతురు):**
తిరుపతి తొక్కిసలాట ఘటనలో అసలు ముద్దాయి సెం చంద్రబాబు నాయుడు అని మాజీమంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తొక్కిసలాటతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్న సిఎం, డిప్యూటీ సిఎంకు బుద్ధిరాలేదని అన్నారు. చంద్రబాబు తన మనుషులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, భక్తుల మీద ప్రేమ, అనుభవం లేనివారికి పదవులు ఇస్తున్నారని రోజా వ్యాఖ్యనించారు.హిందూవులంటే చంద్రబాబుకు గౌరవం లేదా అని రోజా ఆరోపణలు చేశారు. వెంకయ్య ' చౌదరి' కావడాన్నే పదవి ఇచ్చారా? తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయినా చంద్రబాబు మేల్కో లేదని, తిరుపతి తొక్కిసలాటలో మొదటి ముద్దాయి చంద్రబాబు అనే ఆమె అన్నారు. సరైన సంఖ్యలో



పోలీసులను పెడితే తొక్కిసలాట జరిగేది కాదని, ఈ హత్యలు కూటమి ప్రభుత్వం చంద్రబాబు చేసినవేనని, లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని మీకు తెలియదా? మద్యం పాలసీని మారుస్తారు కానీ టోకెన్ సిస్టం ను మార్చరా?? అని ప్రశ్నిచారు. తొక్కిసలాటకు బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు బుక్ చేయలేదు? అని రోజా మండిపడ్డారు. తొక్కిసలాటకు కారణమైన వారి తోలు ఎందుకు పవన్ తీయడం లేదు?? చౌదరి, బిఆర్ నాయుడ్ని శిక్షించడానికి పవన్ ఎందుకు భయపడుతున్నారని, కులం చూసి భయపడను అనే పవన్ ఇప్పుడెందుకు భయపడుతున్నారు. ఎస్పీ, టిటిడి పాలక మండలితో సహా అందరీపై కేసులు పెట్టాలని తిరుపతి తొక్కిసలాటను కోర్టులు సుమోటో తీసుకోవాలని తెలిపారు. తొక్కిసలాట తరువాత భక్తులు భయపడి దైవ దర్శనానికి కూడా రాలేదని, హిందూత్వాన్ని, మన దేవుళ్లను కాపాడుకోవడానికి స్వామిజీలు ఉన్నారన్నారు. పిఠాపురంలో మణికంఠ, చరణ్ కుటుంబాలను పవన్ ఎందుకు పరామర్శించలేదని వైసిపి మాజి మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పాల్సింది క్షమాపణలు కాదు..బాధ్యులను శిక్షించాలన్నారు. టిటిడి ఛైర్మన్, ఈవో, జేఈవో తప్పు చేశారని పవనే చెప్తున్నారని రోజా స్పష్టం చేస్తున్నారు.

# 20 నాటికి భరోసా లబ్ధిదారుల జాబితా

నల్గొండ, జనవరి 11, వెలుతురు:




తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఈ నెల 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అయితే ఇప్పటికే దీనికి సంబంధించిన విధివిధానాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పూర్తిగా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా నిధులు వర్తిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు కాకుండా, రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఉపయోగించిన భూమిని మినహాయించి మిగిలిన అన్ని భూములకు ఈ రైతు భరోసాను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి రైతు ఖాతాలో పన్నెండు వేల రూపాయలు దీంతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా పన్నెండు వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటన చేసిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ వ్యవసాయ యోగ్యమైన భూముల వివరాలను సేకరిస్తున్నారు. అలాగే లబ్ధిదారుల వివరాలను కూడా నోట్ చేసుకుంటున్నారు. కానీ పంట భూముల్లో వేయకపోయినా ఆ భూమి వ్యవసాయ యోగ్యమైనదిగా ఉంటే చాలు దానికి రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. పంట ఎప్పుడు వేశారన్నది కాకుండా.. ఎప్పుడైనా పంట వేసుకునే అవకాశం ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా నిధులను ఆ యా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జనవరి 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో విడతల వారీగా ఈ నిధులను జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అరవై లక్షల మంది వరకూ... ఈ పథకం కింద దాదాపు అరవై లక్షల మంది రైతుల వరకూ లబ్ధి పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీ నాటికి లబ్ధిదారుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. తొలి విడతగా ఎకరానికి ఆరు వేల రూపాయలు చెల్లించనున్నారు. అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలలకు కూడా రెండు విడతలుగా నగదు చెల్లించాలని నిర్ణయించారు. ఇందుకోసంఇప్పటికే నిధులను కూడా సిద్ధం చేశారు. ఒక్క వ్యవసాయ కూలీలకు ఇచ్చే ఆత్మీయ భరోసాకు 700 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేసి ఈ మేరకు నిధులను సిద్ధం చేసి పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను అధికారికంగా ప్రభుత్వం విడుదల చేయనుంది.

# కరువుతో 1.44 లక్షల మంది రైతులకు నష్టం

- రూ.151.77 కోట్లు సాయం చేయాలి
- ఖరీఫ్ 2024 కరువు సాయంపై కేంద్రానికి నివేదిక
- రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా
- కేంద్ర బృందంతో సమావేశం



అమరావతి జనవరి 11, వెలుతురు:

రాష్ట్రంలో కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర బృందం సభ్యులు రైతులకు సాయం అందించేలా ఉదారంగా స్పందించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను వారికి వివరించారు. ఖరీఫ్ 2024 కరువు పరిస్థితులు, పంట నష్టం వివరాలపైనా నివేదిక అందించారు. ఐదు జిల్లాల్లో 1.06 లక్షల హెక్టార్లలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. వారిని ఆదుకునేందుకు రూ.151.77 కోట్లు సాయం చేయాలని కోరారు. ఐదు జిల్లాల్లో 54 మండలాలు (అన్నమయ్య 19, చిత్తూరు 16, సత్యసాయి 10, అనంతపురం 7, కర్నూలు 2) మండలాను ప్రకటించామని తెలిపారు. వాటిల్లో 27 తీవ్ర కరువు మండలాలుగానూ, 22 మధ్యస్థ కరువు మండలాలుగానూ కేంద్ర నిబంధనల ప్రకారమే కరువుగా ప్రాంతాలుగా ప్రకటించామని తెలిపారు. పత్తి, జొన్న, వేరుశనగ, ఎర్రశనగలు, మొక్కజొన్న వంటి 14 రకాల పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో 80 శాతం సబ్సిడీకి విత్తనాలు, రూ.55 కోట్ల వ్యయంతో పశుగ్రాసం విత్తనాలు 60 శాతం సబ్సిడీపై అందించామని తెలిపారు. 40 శాతం సబ్సిడీపై చాప్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టామని సిసోడియా వివరించారు. వ్యవసాయశాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.90.52 కోట్లు, రూరల్ వాటర్ సరఫరా కోసం రూ.0.72 కోట్లు, అర్బన్ వాటర్ సరఫరా కోసం రూ.4.89 కోట్లు, పశు సంవర్ధకశాఖకు రూ.55.47 కోట్ల ఆర్థికసాయం అవసరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని రైతులను ఆదుకోవడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ పెరిన్‌దేవి మాట్లాడుతూ కరువు వల్ల నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వెల్లడించారు. పంట నష్టం జరిగి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు చూస్తామని చెప్పారు. కరువు ప్రాంత జిల్లాల్లో వాస్తవ పరిస్థితులను గమనించామని, అన్ని విషయాలనూ సమగ్రంగా కేంద్రానికి నివేదిస్తామని చెప్పారు. వీలైనంత త్వరంగా సాయం అందించేందుకు సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. కేంద్రం బృందంలో సుప్రియా మాలిక్, అనూరాధ బట్నా, దీపాంకర్ సేథ్, ప్రదీప్‌కుమార్, మన్నూజీ ఉపాధ్యాయ, జయంతి, కె.పొన్నుస్వామి తదితరులు ఉన్నారు.

# కృష్ణుడి సేవలో తరించిన గోదాదేవి

## విగ్రహరూపంలో స్వామిని పరిణయమాడిన మహాసాధ్వి

## సంక్రాంతి ముందు ఏటా గోదా కళ్యాణం ప్రత్యేకం



శ్రీరంగం,జనవరి11( వెలుతురు ):

మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్–వళై యాయ్' అని అంటుంటాం కదా. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదాదేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు వారి అవతారాల్లో. కానీ గోదా దేవి మానవకన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదల గలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుదరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలో ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బంధించి, బంధించి, ఆయన్ని పొందింది. అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆంఢాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీధికి చిత్రవీధి అనే పేరు ఏర్పడిపోయింది. తరువాత వీది ఉత్తరవీది, అక్కడ ఉన్న స్వామి అమ్మని వివాహమాడి గోదాదేవిని తనలో చేర్చుకున్నాడు. మానవకన్యగా ఉన్న ఆండాళ్ తల్లిని ఉత్సవ మూర్తిగా మలచి తానూ ఉత్సవ మూర్తిగా కలిసి ఉన్నాడు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే భక్తుడు ఉండేవాడు. ఈ విల్లిపుత్తూరులోనే శ్రీకృష్ణుడు, మర్రి ఆకు మీద తేలియాడుతూ లోకాన్ని రక్షించాడని నమ్మకం. అందుకే ఇక్కడి ఆలయంలోని ప్రధాన దైవం ఆ చిన్నికృష్ణుడే. విష్ణుచిత్తుడు నిత్యం ఆ కృష్ణునికి పుష్పమాలలని అర్పిస్తూ ఉండేవాడు. ఆయనను విష్ణుభక్తులైన ఆళ్వారులలో ఒకరిగా ఎంచి, ఆయనకు పెరియాళ్వారు అంటే – పెద్ద ఆళ్వారు అన్న గౌరవాన్ని కూడా అందించారు. అలాంటి పెరియాళ్వారు ఒకసారి తులసి మొక్కల కోసం పాదులు తీస్తుండగా ఒక పాప కనిపించింది. ఆమెను సాక్షాత్తూ భగవంతుని ప్రసాదంగా భావించి ఆమెను పెంచుకోసాగాడు విష్ణుచిత్తుడు. ఆమెకు 'కోదై' అంటే – పూలమాల అన్నపేరుతో గారాబంగా పెంచసాగాడు విష్ణుచిత్తుడు. ఆ పేరే క్రమంగా గోదాగా మారింది. గోదాదేవి చిన్ననాటి నుంచి కృష్ణుడి లీలలను ఆడుతూపాడుతూ పెరిగిందే. యుక్తవయసు వచ్చేసరికి ఆ భక్తి కాస్తా ప్రేమగా మారిపోయింది. కళ్లుమూసినా, తెరిచినా ఆ నల్లనివాడే కనిపించసాగాడు. తన చుట్టూ ఉన్న స్నేహితురాళ్లంతా ఒకప్పటి గోపికలనీ, తానుండే విల్లిపుత్తూరు ఒకనాటి గోకులమని భావించసాగింది. అంతేకాదు! తన తండ్రి విష్ణుచిత్తుడు రోజూ భగవంతుని కోసం రూపొందించే మాలలను ముందు తనే ధరించి, తనలో ఆ కృష్ణుని చూసుకుని మురిసిపోయేది. ఈ దృశ్యం ఒకరోజు విష్ణుచిత్తుని కంట పడనే పడింది. తన కూతురు చేసిన పని వల్ల ఇన్నాళ్లూ ఆ దేవదేవుని పట్ల అపచారం జరిగిందని బాధపడ్డాడు. కానీ ఆ రోజు కృష్ణుడు అతనికి కలలో కనిపించి, గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అవతారమేననీ, ఆమె వేసుకున్న మాలలను ధరించిడం వల్ల తనకు అపచారం కాదు కదా, ఆనందం కలుగుతుందనీ తెలియచేశాడు. ఇలాంటి సంఘటనలన్నీ గోదా మనసులో కృష్ణప్రేమని మరింతగా పెంచాయి. ఇలా సాగుతున్న గోదాదేవి ప్రేమకు, ఆ కృష్ణుడు లొంగక తప్పలేదు. దాంతో ఆయన విష్ణుచిత్తునికి కనిపించి, గోదాదేవిని శ్రీరంగానికి తీసుకురమ్మనీ? అక్కడ రంగనాథునిగా వెలసిన తాను గోదాదేవిని వివాహం చేసుకుంటాననీ చెప్పాడు. శ్రీరంగంలోని ఆలయ అర్చకులకు కూడా ఈ విషయాన్ని తెలియచేశాడు. కృష్ణుని ఆదేశాలను విన్న విష్ణుచిత్తుని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే గోదాదేవినీ, విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు. అక్కడ వారి రాక గురించి ముందే తెలిసిన అర్చకులు వారిని ఆలయంలోకి తీసుకువెళ్లారు. పెళ్లికూతురిగా గర్భగుడిలోకి ప్రవేశించిన గోదాదేవి, అందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు భోగిరోజు జరిగింది. అందుకే ప్రతి వైష్ణవాలయంలో భోగినాడు గోదాదేవికి, విష్ణుమూర్తితో కళ్యాణం జరుపుతారు.

# మహాకుంభమేళా విశిష్టత వేరు

- త్రివేణి సంగమంలో స్నానాలు పరమపవిత్రం



ప్రయాగరాజ్,జనవరి11( వెలుతురు):

మహాకుంభ మేళా..12 సంవత్సరాలకోసారి వచ్చే హిందువుల మహా సమ్మేళనం. ఇది ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయినలలో మహాకుంభ మేళా నిర్వహిస్తారు.. జనవరి 13 సంక్రాంతి రోజు ప్రారంభమై ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహాకుంభ మేళాకు దేశ విదేశాల నుంచి 40 కోట్ల హిందువులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ హిందూ మహా సమ్మేళనానికి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు..గంగా, యమునా , సరస్వతి నదుల సంగమం అయిన త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు చేస్తారు. 2025 మహాకుంభమేళా 20258 మహా కుంభమేళా అన్ని కుంభమేళాలలో అత్యంత పవిత్రమైనది. ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ప్రత్యేకమైన ఖగోళ పరిణామాలు జరిగే గొప్ప కార్యక్రమంగా భావిస్తున్నరు. దాదాపు 400 మిలియన్ల మంది సందర్శకులు, హిందువులు వస్తారని తెలుస్తోంది. ఇది సాధారణ కుంభమేళా కంటే చాలా ఎక్కువ. 2025 మహాకుంభమేళా లాంటిది తిరిగి 2169 వరకు జరగదు. ఈకుంభ మేళాలో పాల్గొని భక్తులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని మేళా నిర్వాహకులు చెబుతున్నారు. జ్యోతిష్య శాస్త్ర కారకాలు, ముఖ్యంగా గురు గ్రహం, సూర్యుని స్థానాలు ఈ పవిత్రమైన పండుగ సమయాన్ని నిర్ణయిస్తాయని చెబుతున్నారు. ఈ మహా కుంభమేళా సమయంలో స్నానం చేయడం వల్ల పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. జనవరి 13 పౌష్ పూర్ణిమతో ప్రారంభమై ఫిబ్రవరి 26 మహా శివరాత్రితో ముగుస్తుంది. మహా కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించ బడుతుంది. ఇది అత్యంత పవిత్రమైనది. పూర్ణ కుంభమేళా: నాలుగు ప్రదేశాలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అర్ధ కుంభమేళా ప్రయాగ్‌రాజ్ ,హరిద్వార్‌లలో ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. మాఘ మేళా: మాఘ మాసంలో (జనవరి–ఫిబ్రవరి) ప్రయాగ్‌రాజ్‌లో సంవత్సరానికోసారి జరుగుతుంది.

# పండగలంటే ఊరు.. పాత జ్ఞాపకాలు

నిజామాబాద్,జనవరి11( వెలుతురు):

రోజులు మారుతున్న కొద్దీ.. జనం పల్లెలు వదిలి పట్నాలకు వలస వస్తున్నారు. అరకొర ఉపాధి దొరికి కొంత ఊరట కలిగినప్పటికీ సొంతూళ్లను మిస్ అవుతున్న ఫీలింగ్ ఏదో మూలన ఉండక మానదు. అందుకే పండగలు, పబ్బాలు వచ్చినప్పుడు సొంతూళ్లకు వెళుతుంటారు.. దసరా, సంక్రాంతి, దీపావళి పండుగలను ఊళ్లకు వెళ్లి జోరుగా జరుపు కుం టారు. ముఖ్యంగా సంక్రాంతి లాంటి పెద్ద పండగ వచ్చిన ప్రతీసారి అటు ఏపీ ప్రజలు ఇటు తెలంగాణ ప్రజలు సొంతూళ్ల బాట పడతారు. గత పల్లె జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంటారు. చరిత్ర పుస్తకాల్లో చదివేది కాదు మన జీవితాలకి మూలం అని తెలియాలంటే ఊరికి దగ్గరలో ఉన్న పాత గడీ, కోటగోడ, పాతగుడి లాంటివి. మనం చిన్న నాడు చదువుకున్న స్కూల్, ఈతకొట్టిన పెద్ద బావి లాంటి ప్రదేశాలన్నీ పిల్లలతో కలసి ఎంజాయ్ చేయాలని ఉంటుంది. పెంకుటిళ్లూ, మట్టిగోడలూ దాటుతున్నప్పుడూ వాటిమీద దృష్టి పడేలా చెయ్యండి. ఒకప్పుడు మనం తిరిగిన పల్లె ఎలా మారిపోతోందో ఒకసారి గుర్తు చేసుకోవాలని ఎవరికి ఉండదు. అప్పుడప్పుడూ ఆ రోజుల్లోకి వెళ్ళిపోవటం ఇప్పుడు వినటానికి చికాకుగా ఉన్నా గుర్తు చేసుకున్నప్పుడు బాగుంటుంది..... అదే కాదు ఒక్కసారి పిల్లలకి ఇవన్నీ చూపించాక వాళ్ళ ఆలోచనా తీరు ఎలా మారిపోతుందో గమనించొచ్చు.

# వాతావరణంలో మార్పులు

- మరోమారు తుఫాన్ పరిస్థితులు

విశాఖపట్టణం, జనవరి11( వెలుతురు):

సంక్రాంతి ముందు వాతావరణం మబ్బుగా ఉంటుంది. చలికూడా తీవ్రంగానే ఉంటుంది. అయితే రాబోయే కొద్ది రోజుల్లో.. అంటే సంక్రాంతి పండుగ తర్వాత తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కేరళ వాతావరణ శాఖ రిలీజ్ వెదర్ రిపోర్టులో ఈ మేరకు వివరించింది. ఈ నెలాఖరులో బంగాళాఖాతంలో, హిందూ మహా సముద్రంలో తుఫాన్ ఏర్పడే సూచనలు ఉన్నాయని.. అందుకే వాతావరణంలో విపరీతమైన మార్పులు అని వెల్లడించింది. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో కొన్ని రోజులుగా వేడి వాతావరణం ఉందని.. సంక్రాంతి పండక్కి చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. బంగాళాఖాతం, హిందూమహా సముద్రం నుంచి భూ వాతావరణంలోకి గాలులు పెరిగాయని.. ఈ ప్రభావంతోనే చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని కేరళ వెదర్ రిపోర్ట్ వెల్లడించింది.కేరళ వాతావరణ శాఖ నివేదికల ప్రకారం.. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో రానున్న వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడ నుందని.. ఇది బలపడి వాయుగుండంగా మారనుందని తెలిపింది. ఈ అల్ప పీడన ప్రభావంతో జనవరి 12, 13 తేదీలలో కేరళలో ఉరుములతో



కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లొద్దని సూచించింది. కేరళ,– కర్ణాటక, లక్షద్వీప్ తీరాల్లో చేపల వేటకు ఎలాంటి అంతరాయం ఉండదని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 35 నుండి 45 కి.మీ వేగంతో కూడిన బలమైన గాలులు వీస్తాయని.. దీని ప్రభావంతో కేరళ, తమిళనాడులో అక్కడకక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది వెదర్ డిపా÷–టం÷–మెంట్. అలాగే, 11, 12వ తేదీన దక్షిణ తమిళనాడు తీరం, గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లోని కన్యాకుమారి ప్రాంతంలో గంటకు 35 నుండి 45 కిమీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం సంక్రాంతి పండుగ లోపు బలపడి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని.. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వాయుగుండం తీవ్రమై తుఫాన్ గా మారే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాణ అంచనా వేసింది.

# తెలంగాణ ప్రజలకు దిల్‌రాజ్ క్షమాపణలు

ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలంగాణ ప్రజలకు క్షమాపణలు తెలిపాడు. తనకు తెలంగాణ కల్చర్ అంటే ఇష్టమని అందుకు మన దావత్‌ల గురించి చెబుతూ తెల్ల కల్లు, మటన్ అని ప్రస్తావించినట్లు దిల్ రాజు వివరణ ఇచ్చాడు. ఈ సందర్భంగా ఒక వీడియో విడుదల చేశాడు. దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే మూవీ విడుదల సందర్భంగా దిల్ రాజు హోం టౌన్ అయిన నిజామాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు మేకర్స్. అయితే ఈ వేడుకలో దిల్ రాజు మాట్లాడుతూ.. ఆంధ్రాలో సినిమాకు ఓ వైబ్ ఇస్తారు. మన దగ్గర (తెలంగాణలో) కల్లు, మటన్ కు వైబ్ ఇస్తాం. చలికాలం చెట్లలోకి పోయి కల్లు



తాగుదాం అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే దిల్ రాజు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో పాటు తెలంగాణ ప్రజలంటే తాగుబోతులా అంటూ దిల్ రాజు అనడం కరెక్ట్ కాదని ఈ విషయంలో దిల్ రాజు వెంటనే క్షమాపణలు చెప్పాలని ప్రజలు కోరుతున్నారు.అయితే తాను చేసిన వ్యాఖ్యలపై దిల్ రాజు తెలంగాణ ప్రజలకు క్షమాపణలు తెలిపాడు. అందరికీ నమస్కారం మొన్న ఈ మధ్య నిజామాబాదులో మేము సంక్రాంతికి వస్తున్నాం ఈవెంట్ చేయడం జరిగింది అది నిజామాబాద్ పట్టణంలో ఫస్ట్ టైం ఇంతకు ముందు ఎప్పుడు మన దగ్గర సినిమా ఈవెంట్స్ పెద్దగా జరగవు. ఒకసారి ఫిదా సక్సెస్ మీట్ ఒకటి పెట్టాం మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం చేశాం. అంటే నిజామాబాద్‌తో నాకున్న అనుబంధం అలాంటిది నిజామాబాద్ జిల్లా వాసిగా అక్కడ ఈ సినిమా ఈవెంట్ చేయాలని చేశాను. అయితే ఆ ఈవెంట్‌లో నేను మన కల్చర్‌లో ఉండే మన దావత్ గురించి మటన్ అలాగే తెల్ల కల్లు గురించి సంబోధించాను. అయితే ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతాయి అని అనుకోలేదు. తెలంగాణ మన కల్చర్ మన దావత్‌ని నేను మిస్ అవుతున్నాను. అందుకే అలా చెప్పాను అని పేర్కొన్నాడు.

## మోకాళ్ల మీద తిరుమల మెట్లు ఎక్కిన నందిని రాయ్

బిగ్‌బాస్ ఫేం నందినిరాయ్  మోకాళ్ళ మీద తిరుమల మెట్లు ఎక్కి దైవ దర్శనం చేసుకుంది. నందిని రాయ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సినిమాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ సోషల్ మీడియాలో కొత్తకొత్త లుక్స్‌లో కనిపిస్తూ అందరి మతులు పోగొడుతుంది. అయితే ఈ భామకి దైవ చింతన ఎక్కువేనని ప్రకటించిన విషయం తెలిసిందే. తనకు సమయం దొరికినప్పుడల్లా తిరుమలకి వెళుతుంది ఈ భామ.  అయితే తాజాగా నందిని రాయ్ తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. తొలి ఎకాదశి సందర్భంగా.. మెట్ల మార్గంలో మోకాళ్లపై ఏడుకొండలపైకి చేరుకొని.. తిరుమలేశుడిని దర్శించుకుంది. అద్భుతమైన అనుభవం.. దేవుడికి కృతజ్ఞతలు చెప్పలేకుండా ఉండలేకపోతున్నా.. మోకాళ్లపై కొండపైకి వెళ్లి గోవిందుడి ఆశీస్సులు పొందానంటూ వీడియోను షేర్ చేసింది. కాగా ఈ వీడియో ఇపుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఈ భామ తెలుగులో మాయ, మోసగాళ్లకు మోసగాడు, సిల్లీ ఫెలోస్, శివరంజనీ చిత్రాల్లో నటించింది. వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో గాలివాన వెబ్ సిరీస్ కూడా చేసింది. స్పెషల్ సాంగ్‌లో కూడా మెరిసింది నందినీ రాయ్. ఈ హైదరాబాదీ భామ తెలుగుతోపాటు కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో కూడా నటించింది.



## సౌత్ వాళ్లు ఆ పనైనా మానిస్తేరు కానీ.. సినిమాలు చూడటం మానరు : రాశిఖన్నా

'ది సబర్మతి రిపోర్ట్' సినిమాతో ఇటీవల సూపర్ హిట్ అందుకుంది నటి రాశి ఖన్నా. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసిన ఈ భామ ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సిద్దు జొన్నలగడ్డ నటిస్తున్న తెలుసుకదా సినిమాతో పాటు తమిళంలో అగాథియా అనే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు సౌత్ సినిమా అభిమానులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశి మాట్లాడుతూ.. దక్షిణాదిలో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుడి లాగా కోలుస్తారు. సినిమా విడుదల అప్పుడు పండుగల భావిస్తారు. అందుకే సౌత్‌లో ప్రేక్షకులు తిండి అయిన మానేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు అంటూ రాశి ఖన్నా చెప్పుకోచ్చింది.



## ఆ ఊరి అమ్మాయితోనే ప్రభాస్ పెళ్లి

### ఆసక్తిగా మారిన రాంచరణ్ కామెంట్





టాలీవుడ్‌లో మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ ఎవరైనా ఉన్నారంటే.. అది మన డార్లింగ్ రెబల్ స్టార్ ప్రభాస్ మాత్రమే. ఆయన పెళ్లి కోసం ఒక్క తెలుగు రాష్ట్రాలే కాదు.. దేశమంతా ఎదురుచూస్తోంది. ప్రపంచంలోని ఫ్యాన్స్ కూడా ప్రభాస్ పెళ్లి ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్‌ను రెబల్ స్టార్ పెళ్లాడుతారని అనేక వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు అలాందేమీ జరగలేదు. ఓ రెండేండ్ల క్రితం భీమవరానికి చెందిన రాజుల అమ్మాయిని పెళ్లాడుతారని వార్తలు షికారు చేశాయి. ఈ వార్తలు కూడా గాసిప్‌గానే మిగిలిపోయాయి. ఇప్పుడు మళ్లీ ప్రభాస్ పెళ్లిపై వార్తలు షికారు చేస్తున్నాయి. ప్రభాస్ పెళ్లిపై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హింట్ చేశారు. 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రమోషన్స్ కోసం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్.. బాలకృష్ణ 'అన్ స్టాపబుల్' షోలో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. బాలయ్య.. ప్రభాస్ పెళ్లి గురించి ప్రస్తావన తీసుకురాగా ప్రభాస్ ఫ్యాన్స్‌కు తీపి కబురు అందించారు. అవును.. షోలో ప్రభాస్ ఏ ఊరి అమ్మాయిని పెళ్లి చేసుకోనున్నాడో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ అమ్మాయి ఎవరో కాదు.. పదహారు అణాల తెలుగు అమ్మాయి. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంకు చెందిన అమ్మాయిని ప్రభాస్ పెళ్లాడబోతున్నట్లు చరణ్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఈ వార్తలు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. కాగా, ప్రభాస్ ఫ్యాన్స్ ఈ వార్త నిజం కావాలని గట్టిగా కోరుకుంటున్నారు. త్వరలోనే ప్రభాస్‌ను పెళ్లిపీటలపై చూడాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## ఆ నొప్పులు సరదాగా ఉంటాయ్ - సమంత


టాలీవుడ్ హీరోయిన్ సమంత.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. తనకు సంతోషం కలిగినా, బాధ కలిగినా.. ప్రతీ విషయాన్ని ఆమె తన అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకుంటుంది. అలానే తాజాగా సమంత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల తాను చికెన్ గున్యా వ్యాధి బారిన పడినట్లు సమంత తెలిపింది. అయితే ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియోను సమంత్ షేర్ చేసింది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పులు నుంచి కోలుకోవడం అనేది చాలా ఫన్‌గా ఉంటుందంటూ ఆ బ్యూటీ రాసుకొచ్చారు. సమంత త్వరగా కోలుకోవాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. గతంలో సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన సంగతి తెలిసిందే. ఖుషి మూవీ టైమ్‌లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు ఆమె తెలిపింది. అప్పట్నుంచి తన ఆరోగ్యం క్షీణించిందని చెప్పింది. మయోసైటిస్ చికిత్స కోసం మెడిసిన్స్, ఆయుర్వేదం, భూటాన్‌లో ప్రకృతి వైద్యం ఇలా రకరకాల పద్ధతుల్ని సమంత ప్రయత్నించింది.



## దూసుకపోతున్న గేమ్‌ఛేంజర్

### మొదటిరోజే రూ.186 కోట్లకు పైగా వసూళ్లు

రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్‌లో నటించి అలరించాడు. అయితే ఈ సినిమా తొలిరోజే రికార్డు కలెక్షన్లు అందుకుంది. మొదటిరోజు ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.186 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ ఫీట్ సాధించిన టాప్ టెన్ ఇండియన్ సినిమాలలో గేమ్ ఛేంజర్ కూడా నిలిచింది. ఇక మొదటి రోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలు చూసుకుంటే.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ రోజు రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టింది. పుష్ప తర్వాత రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ (రూ.223 కోట్లు), బాహుబలి 2(రూ.214 కోట్లు) చిత్రాలు ఉన్నాయి.




## నాంపల్లి కోర్టులో అల్లుఅర్జున్‌కు ఊరట

సినీ నటుడు అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. రెగ్యులర్ బెయిల్‌కి అప్లయ్ చేసిన అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టు ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను కోర్టు మినహాయించింది. అలాగే విదేశాలకు వెళ్లేందుకు కూడా అల్లు అర్జున్‌కి కోర్టు అనుమతినిచ్చింది. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై అల్లు అర్జున్‌ని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టు ముందు హాజరుపర్చగా.. అతడికి 14 రోజు జ్యూడిషియల్ రిమాండ్



విధించింది కోర్టు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించగా.. తెలంగాణ హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో బెయిల్ మీద బయటికి వచ్చాడు బన్నీ. అయితే రీసెంట్‌గా బెయిల్ గడువు కూడా ముగియడంతో రెగ్యులర్ బెయిల్ కోసం అప్లయ్ చేసుకోగా.. నాంపల్లి కోర్టు బన్నీకి పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

## భారత్ మెట్రో... నయా రికార్డ్...



**న్యూఢిల్లీ, జనవరి 11, వెలుతురు:**
ప్రపంచవ్యాప్తంగా రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌తో దేశంగా అవతరించేందుకు భారతదేశం సిద్ధమవుతోంది. అర్బన్ మొబిలిటీలో ప్రధాన మైలురాయిని సాధించడానికి సిద్ధంగా ఉంది. భారత్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్ 1000 కి.మీలకు పెరిగింది. ఇంత పెద్ద నెట్‌వర్క్‌తో, చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారతదేశం అవతరించింది. ఈ క్రమంలోనే మెట్రో సేవలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఢిల్లీ మెట్రో మెజెంటా లైన్ పొడిగింపును ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రారంభించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సాహిబాబాద్, ఢిల్లీలోని న్యూ అశోక్ నగర్ మధ్య నిర్మించిన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ నమో భారత్ కారిడార్‌లోని 13 కిలోమీటర్ల పొడవైన సెక్షన్‌ను కూడా ఆయన ప్రారంభిస్తారు. సాహిబాబాద్, న్యూ అశోక్ నగర్ మధ్య నమో భారత్ కారిడార్‌లోని 13 కిలోమీటర్ల అదనపు ఢిల్లీ సెక్షన్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. కొత్తగా ప్రారంభించే 13 కి.మీ విభాగంలో, ఆరు కి.మీ భూగర్భంలో ఉంది. కారిడార్‌లోని ఆనంద్ విహార్‌లోని ప్రముఖ స్టేషన్‌ను కలిగి ఉంది. భూగర్భంలో నమో భారత్ రైళ్లు నడపడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు.వేగవంతమైన పట్టణీకరణ ద్వారా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో అర్బన్ మొబిలిటీ ప్రాముఖ్యత పెరుగుతోంది. ప్రస్తుతం, భారతదేశంలోని 23 నగరాల్లో 993 కిలోమీటర్ల మెట్రో రైలు పరుగులు పెడుతోంది. అదనంగా, మరో 28 నగరాల్లో మరో 997 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ నిర్మాణంలో ఉంది. మెట్రో ప్రాజెక్టలతో పాటు, భారతదేశం ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్స్ లో కూడా పెట్టుబడి పెడుతోంది. ఇది ప్రధాన నగరాలు, పట్టణ కేంద్రాలను కలుపుతూ ఏకీకృత పట్టణ చలనశీలత పర్యావరణ వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాంతీయ కనెక్టివిటీలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని భావిస్తోంది ఖీఖీమీ.పట్టణీకరణలో ఒక సంచలనాత్మక ఆవిష్కరణ 'వన్ నేషన్ వన్ కార్డ్' కార్యక్రమం. మార్చి 2019లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఔఅఓఅ) ఒకే కార్డుతో మెట్రో, రైలు, బస్సు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థల్లో అతుకులు లేని ప్రయాణాన్ని అనుమతిస్తుంది. ఈ చొరవ లక్షలాది మంది ప్రయాణికులకు ప్రజా రవాణాను సులభతరం చేయడం, ఏకీకృతం చేయాలనే ప్రభుత్వ దృక్పథానికి ఉదాహరణ.మెట్రో నెట్‌వర్క్, పట్టణ రవాణా వ్యవస్థలను విస్తరించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలు స్థిరమైన, సమర్థవంతమైన పట్టణ చలనశీలతను ప్రోత్సహించడానికి ఒక పెద్ద దృష్టిలో భాగం. 2025 నాటికి, దాదాపు 2,000 కిలోమీటర్ల మెట్రో రైలు 51 నగరాల్లో పని చేయడం లేదా నిర్మాణంలో ఉండటంతో, భారతదేశం అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా స్థిరపడుతుంది. పట్టణ వాసులకు వేగవంతమైన రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. భారతదేశం వేగంగా విస్తరిస్తున్న మెట్రో నెట్‌వర్క్, వినూత్న అర్బన్ మొబిలిటీ సొల్యూషన్‌లు నగరాల పనితీరును మారుస్తున్నాయి. సమర్థవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించడం పట్టణ నివాసితులకు ఉజ్వల భవిష్యత్తును హామీ ఇస్తుంది. ప్రయాణాన్ని వేగంగా, మరింత అందుబాటులోకి తీసుకువస్తుంది. ప్రపంచంలోని రెండవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ పట్టణ చైతన్యాన్ని పునర్నిర్వచించే దిశగా భారతదేశం ప్రతిష్టాత్మక ప్రయాణం ప్రారంభం మాత్రమే.

## కోళ్లకే కాదు గుడ్లకు డిమాండే



**ఒంగోలు జనవరి 11,:**
సంక్రాంతి సమీపిస్తోంది. కోడిపందాలకు శిబిరాలు సిద్ధమవుతున్నాయి. పందెం కోళ్ళు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాయి. దీంతో కోస్తాంధ్రలో సందడి నెలకొంటోంది. అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా ఇదే సందడి నెలకొంది. పందెం కోళ్ళకే కాదు.. అవి పెట్టే గుడ్లకు కూడా భలే డిమాండ్. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 700 రూపాయల వరకు పలుకుతోంది ఒక్క గుడ్డు ధర. పందెంకోడి ఏంటి? గుడ్లు పెట్టడం ఏంటి? అని అనుకుంటున్నారు కదా? తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదివావాల్సిందే. ప్రకాశం జిల్లా తీర ప్రాంతంలోని కొత్తపట్నం, సింగరాయకొండలో గుడ్లను జాతి పెట్టలతో పొదిగించి.. పుంజులను ప్రత్యేకంగా సంరక్షిస్తుంటారు. వాటినే పందెం కోళ్ళుగా బరిలో దింపుతారు. కోస్తాంధ్రతో పాటు ఉభయగోదావరిజిల్లాల్లో కోళ్ల పందాలు జరుగుతాయి. కానీ అక్కడి పుంజులను మాత్రం అందించేది ప్రకాశం జిల్లాపందెం కోళ్లలో రకరకాల కోళ్లు ఉంటాయి. వీటిలో ప్రధానంగా తూర్పుకోడి, పెర్విన్ కోడి, భీమవరం కోడి, ఎర్ర మైల, అబ్రాస్ మైల, కాకి నెమలి, తెల్ల నెమలి, నల్లపడ కోడి, కాకి డేగ, ఎర్ర కక్కెర, తెల్ల కోడి, కాకి నెమలి, పెట్టమారు వంటి పుంజులు సంక్రాంతి బరిలో దిగుతాయి. అయితే ఈ పుంజులకు సంబంధించి పుట్టుక వెరైటీగా ఉంటుంది. నల్ల పెట్ట, డేగ పెట్ట, తెల్ల పెట్ట, బూడిద రంగు పెట్ట, అబ్రాసు పెట్ట, కక్కెర పెట్టలు పందెం కోడిపుంజులతో కలవడం ద్వారా.. గుడ్లు పెడతాయి. కానీ ఇది పొదగవు. ఈ గుడ్లను ప్రత్యేక నాటు కోళ్లతో పొదిగిస్తారు. అందుకే ఈ గుడ్డుకు అంత ధర. ఒక్కో గుడ్డు 400 నుంచి 700 వరకు విక్రయిస్తారు. డిమాండ్ బట్టి వీటి ధర పెరిగిపోతుంటుంది. అయితే ఈ గుడ్లు తినే కంటే.. పందెం కోళ్ళుగా తీర్చిదిద్దేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. భరత్ పెరగడానికి అదే కారణం.నాటు కోళ్లతో పొదిగించే క్రమంలో.. గుడ్డు పెట్టిన తర్వాత మూడు వారాలకు పిల్ల అవుతుంది. అప్పటినుంచి రెండేళ్ల పాటు వాటికి ప్రత్యేక ఆహారం పెడతారు. సుమారు ఏడాదిన్నర పాటు రాగులు, సజ్జలు పెడుతుంటారు. తరువాత ఆరు నెలలు కాలం బాదం, ఖర్జూరం, అంజూర్, యాలుక, రసగుల్లా, రంగుల ద్రాక్ష, క్రిస్మస్, నాటు కోడి గుడ్డు వంటి బలవర్ధకమైన ఆహారాన్ని పెడతారు. కొన్నింటికి పోతు మాంసం కూడా పెడుతుంటారు. దీనిని తినడం ద్వారా పుంజు బలంగా ఉండడమే కాక బరిలో అవతలి పుంజును సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అయితే కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో ఇదో కుటీర పరిశ్రమగా మారింది. కొంతమంది కోడిగుడ్లను అమ్ముకుంటూ ఉపాధి పొందుతుండగా.. మరికొందరు పందెం పుంజులను విక్రయించి జీవనం సాగిస్తున్నారు.

# ఉష్...అది ఆయుష్...!.?

- ప్రభుత్వం మారినా పాతవాసనలే..!
- అడ్డగోలు జి,ఓకు బలవుతున్న బడుగులు
- అంతా వారి కనుసన్నల్లోనే...
- అడిగితే అవమానాలు..వేధింపులు
- తీరు మారని ఆయుష్కు చికిత్స అత్యవసరం

**విజయవాడ, జనవరి 11, వెలుతురు:**
ఆయుష్ శాఖ అంటే ఒకప్పుడు నిఖార్సైన శాఖ,రోగుల సేవ తప్ప మరో ధ్యాసలేని వైద్యులు,సిబ్బంది..అటెండర్ స్థాయి నుంచి డైరక్టర్ దాకా వారి వారి పనులు వారు నిశ్చింతగా చేసుకుంటూ పోయేవారు.అన్ని వ్యవస్థలలోనూ జోక్యం చేసుకుని వాటిని సర్వనాశనం చేసిన గత ప్రభుత్వం ఈ ఆయుష్లోనూ వైరస్లా జొరబడిరది. అలోపతి వైద్యవిధానంలో సైతం నయం కాని చాలా జబ్బులను నయం చేసే ఆయుష్ విభాగం తన శాఖలో జొరబడిన వైరస్ను కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటినా ఏమీ చేయలేని దుస్థితిలో వుంది.వై.ఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలతో ఆయుష్లో వైద్యం తక్కువ వేదన ఎక్కువగా మారింది. మందుల కొనుగోలు, ఇష్టా రీతిన బదిలీలు,డెప్యుటేషన్లు చేపట్టి ప్రశాంతంగా వుండేశాఖలోఅలజడులుసృష్టించారు.చివరకు ఆయుష్ శాఖలో ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, అనుకూలమైన ప్రదేశాలకు బదిలీలకు కూడా గండి కొడుతూ 16.03.2024 న తీసుకువచ్చిన జి.ఓ 53 పూర్తిగా ఆయుష్ ఉసురుతీసేలా మారింది, ఈ జి.ఓ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది ఎస్సీ,ఎస్టీ మైనారిటీలే.

ఆయుష్ శాఖలోని ఎస్సీ,ఎస్టీలకు చెందాల్సిన ఉన్నత పోస్టులను ఇతర పోస్టులకు మారుస్తూ గత ఆయుష్ కమిషనర్ 2024 ఏడాది ఫిబ్రవరిలో ఓ ప్రతిపాదన చేయడంతో అప్పటి ప్రభుత్వం ఆఘ మేఘా ల మీదఆయన ప్రతిపాదనలను కనీసం పరిశీలించకుండా, దాని లో టుపాట్లను ఏమాత్రంపరిగణనలోకి తీసుకోకుండా 16.03.2024న జి.ఒ.ఎం.ఎస్ నెం.53 ను విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోగుట్టుచప్పుడు లేకుండా తీసుకువచ్చిన ఈ జి.ఓ వల్ల అప్పటిదాకా కొనసాగుతున్న హేతుబద్ధత లేకుండా పోయింది.

ఆయుష్లో కేడర్ స్ట్రెంత్ విషయానికి వస్తే ఆరు పోస్టుల విభజనలో
4 ప్రాంతీయ ఉపసంచాలకుల పోస్టుల్లో రెండు పోస్టులు ఆయు ర్వేదం,ఒక పోస్టు యునాని,మరొకటి హోమియోకు కేటాయించారు. ఉదాహరణకు కర్నూలు జిల్లా బనగానిపల్లె ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి చీఫ్మెడికల్ ఆఫీసర్ పోస్టు జిల్లా అదనపు డైరక్టర్ ( ఆయుర్వేదం) గా అప్గ్రేడ్ చేయబడిరది.

ఇన్స్పెక్టర్ పోస్ట్ 2005 మార్చి 14న జారీ చేసిన జి.ఓ 67 ప్రకారం బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ కు చెందినది,1956లో ఆయుష్ శాఖ ఏర్పడిన తరువాత ఇన్స్పెక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్యులతో భర్తీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క యునానీ మెడికల్ స్టోర్ కూడా లేదు.ఆయుర్వేదం విషయానికి వస్తే రాష్ట్రవ్యాప్తంగా అనేక ఫార్మసీలు, డిస్పెన్సరీలు,ఆసుపత్రులు వుండటంతో ఇన్స్పెక్టర్ పోస్టును ఆయుర్వేద వైద్యులతో భర్తీచేశారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన ఉద్యోగ విభజనలో ఇన్స్పె క్టర్బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్య విధానం కోసం రాష్ట్రానికి కేటా యించారు. ఇన్స్పెక్టర్ బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ తోపాటు తత్స మానమైనసూపరింటెండెంట్ /సి.ఎం.ఓ/ ఆర్.ఎం.ఓ పోస్టులుకేంద్రంసూచించిన మార్గనిర్దేశనంలో పేర్కొన బడ్డాయి. ఈ కేడర్ స్ట్రెంత్ 4గా మారుతుంది.

ఇదిలా వుండగా రీజన్ డిప్యూటీ డైరక్టర్ పోస్టులు నాలుగు ఆంధ్రప్రదేశ్కు 2 పోస్టులు తెలంగాణకు కేటాయించారు.ఆ నాలుగు రీజనల్ డిప్యూటీ డైర్టర్ పోస్టులను ఆయుర్వేదం,యునానీ,హోమియో విభా గాలకు 2:1:1 నిష్పత్తిగా పంపిణీ చేశారు.దీంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించేది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 53 జి.ఓ ప్రకారం పరిపాలనా విభాగం పూర్తిగా గందరగోళంగా మారింది.యునానిలో ఆసు పత్రీలేదు, ఫార్మసీలేదు అయినా 2023లో జరిగిన సాధారణ బదిలీలలో ఇన్స్పెక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టు యునాని విభాగంతో భర్తీ చేశారు. దీంతో కేడర్ స్ట్రెంత్ నాలుగుకు పడిపోయింది, కేడర్స్టెంత్ 6 కంటే తక్కువ వుంటే పదోన్నతులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించదు,దీని పర్యవసానంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ,ఎస్టీల కేడర్ తగ్గి వారు రూల్ ఆఫ్ రిజర్వేషన్కు దూరం అయ్యారు. ఇది ఒక రకంగా రాజ్యాంగం ఎస్సీ.ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రక్రియకు విఘాతం కలి గించడమే అవుతుంది.ఇన్ని సున్నితమైన అంశాలను పక్కనబెట్టి మొండిగా ఈ జి.ఓను అప్పటి ప్రభుత్వంలో అమలుచేసిన కీలక అధికారులే ఇప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.జి.ఓ నెం53 మీద అనేక మంది అనేక రకాలుగా తమ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా అవి ప్రభుత్వ పెద్దలదాకా వెళ్ళ కుండా చేయడంలోనూ ఆ కీలక అధికారులు తమ చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

కేవలం కొందరు వ్యక్తుల ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే ఈ జి.ఓ తీసుకువచ్చి కొన్ని పోస్టులను తొలగించారు.ఈ జి.ఓను కూడా ఎన్నికల నియమావళి అమలులో వున్నపుడు నోట్ఫైల్ ద్వారా కేబినెట్ ఆమోదం తీసుకుని అమలుచేయడం వెనుక ఎందరు పెద్దల హస్తం వుందోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ చీకటి జి,ఓ వెనుక ఎ.పి సెక్రటేరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడుగా అప్పట్లో పనిచేసిన వెంకటరామిరెడ్డి కీలక పాత్ర పోషించా రన్నది నిర్వివాదాంశం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియమితులైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికీ ఆ శాఖ మీద పూర్తి పట్టు సాధించలేదు.ఆయన మాట కీలక అధికారులు పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.శాఖలో పెత్తనం అప్పుడూ..ఇప్పుడూ ఒకరిద్దరు కీలక అధికారులదే. వీరు తమ శాఖలో ఎన్ని లొసుగులు వున్నా వాటిని తమ పలుకుబడితో కప్పేస్తుంటారని ఆ శాఖలో ఎవరిని అడిగినా చెబుతారు.సాక్షాత్తూ ముఖ్యమంత్రిని కూడా తప్పుదోవ పట్టించే శక్తి సామర్థ్యాలున్న కీలక అధికారుల విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే ఉద్యోగుల్లో తీవ్ర నిరసనలు ఎదురవ్వక తప్పదు.

మందుల కొనుగోలులో దారుణాలు

ఇక గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో మందుల కొనుగోలు అంశలో కూడా అనేక అక్రమాలు జరిగాయి. ఆయుష్ మందుల కొనుగోలు కోసం జగన్ ప్రభుత్వం గోవాకు చెందిన ఓ కంపెనీ నుంచి 20 కోట్లతో కొనుగోలు చేశారు.ఈ కంపెనీకి మన ప్రభుత్వం ఆర్డ్రు ఇచ్చే నాటికే పలు రాష్ట్రాలు ఆ కంపెనీని బ్లాక్లిస్టులో పెట్టాయి.ఇక్కడ ఇంకో ముఖ్య మైన అంశం పరిశీలిస్తే ఆ కంపెనీ మందులు సరఫరా చేయక మునుపే మొత్తం నగదును చెల్లించేశారు.దీని వెనుక అప్పటి సి.ఎం.ఓలో ఓ కీలక అధికారితో పాటు,వైద్య ఆరోగ్యశాఖ,ఆయుష్ విభాగంలోని కీలక అధికారుల పాత్ర వుందని తెలసింది.గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో కీలక అధికారిగా వున్న ఓ అధికారి కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా మూడునెలల పాటు కొనసాగారు.మందుల కొనుగోలు విషయంలో వచ్చిన ఆరోపణలపై కూటమి ప్రభుత్వం
విచారణకు ఆదేశించగా 14 డిస్పెన్సరీలలో తనిఖీలు చేయగా అసలు చాలా చోట్ల మందులే కని పించలేదు.విశాఖపట్టణం,ఏలూరు,ఒంగోలు,కడప ప్రాంతీయ విభాగాల పరిధిలో విచారణ మొదలు కాగానే కొందరు ఉన్నతాధికారుల ఒత్తిడితో ఆ విచారణ అర్ధంతరంగా ముగిసింది. అప్పటికే విచారణ బృందం శాంపుల్గా చేసిన తనిఖీలలో దాదాపు 2 కోట్ల రూపాయల విలువచేసేమందులు కనిపించలేదు. ఇక పూర్తి స్థాయిలో విచారణచేసి వుంటే మరింత అవినీతి బయటపడేది.

ఇక మరో అంశం విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదం,యునాని వైద్యవిధానాలను గ్రామీణుల చెంతకు ఆశా వర్కర్ల ద్వారా తీసుకువచ్చేందుకు దాదా పు 5 కోట్ల రూపాయలు కేంద్రం నిధులు మంజూరు చేసింది.ఈ నిధులు పూర్తిగా తమకు కావాల్సిన వారికి దొడ్డిదారిన చెల్లించి తూతూ మంత్రంగా ఈ కార్యక్రమాన్ని ముగించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచి వున్న ఆయుష్లో కీలక అధికారి కూటమి ప్రభుత్వలోనూ తన హవా కొనసాగించారు.చివరకు కొందరు మహిళా ఉద్యోగుల ఫిర్యాదుతో అతనని తప్పించి మరొకరిని కూటమి ప్రభుత్వం నియమించింది,ఎంతో ఉన్నతాశయంతో ఏర్పడ్డ ఆయుష్ విభాగానికి మంచి నిబద్ధత కలిగిన అధికారి అప్పగించి తిరిగి గాడిన పెట్టాలని,ఆ దిశగా ప్రభుత్వం యోచిస్తుందని ఆశిద్దాం.

# సామినేని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు...



**విజయవాడ, జనవరి 11, వెలుతురు:**
ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వైసిపిలో కొత్త తలనొప్పి మొదలైందట. ఎన్నికల ఫలితాల తరువాత ఆ పార్టీని నడిపించే నాయకుడు లేక నియోజకవర్గం నేతలు తలలు పట్టుకుంటున్నారట. ఏరి కోరి మరీ వైసీపీ బాధ్యతలు అప్పగించిన ఉదయభాను పార్టీని వీడడంతో.. చివరికి నియోజకవర్గంలో నడిపించే నాయకుడు లేక.. కొత్త నాయకుడు రాకపోతాడా? అంటూ ఎదురు చూపులు చూస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట. అలాంటి నియోజకవర్గంలో వైసీపీ జెండాను ఒక్కసారి రెపరెపలాడించి.. ఆ పార్టీ కి నియోజకవర్గంలో ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చారు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌లకి వీర విధేయుడైన సామినేని ఉదయభాను . కాంగ్రెస్ పార్టీని వీడి జగన్ పక్షాన చేరిన తర్వాత గత మూడు పర్యాయాలుగా నియోజకవర్గ నాయకుడిగా ఆయనే వైసీపీని నడిపిస్తూ వచ్చారు . 2014 , 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున తన అదృష్టాన్ని పరీక్షించుకున్న సామినేని ఉదయభాను 2019 ఎన్నికల్లో మాత్రమే వైసీపీ తరపున గెలిచారు.వైసీపీ జెండాను జగ్గయ్యపేట నియోజక వర్గంలో పార్టీ ఎగరేశామన్న ఆనందం ఉదయభానుకి ఒక్కసారే దక్కింది. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి సామినేని ఉదయభాను పోటీచేసినా టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2019 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీరామ్ తాతయ్యను ఓడించగలిగారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సామినేని ఉదయభానుకి పరాజయం తప్పలేదు. అంతవరకు బాగానే ఉన్నా 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవ్వగానే ఉదయభాను వైసీపీకి రాజీనామా చేసి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. దాంతో ఇప్పుడు జగ్గయ్యపేట నియోజకవర్గానికి వైసీపీ నాయకుడు ఎవరు అనే చర్చ మొదలైంది.నియోజకవర్గంలో సామినేని ఉదయభాను పార్టీని వీడటంతతో ఇప్పుడు ఆ పార్టీని నడిపించే నాయకుడు నియోజకవర్గంలో లేరని ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవి ఇవ్వలేదని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం తిరిగి సీటు కేటాయించే విషయంలో సైతం మీన మేషాలు లెక్కించారని అలకబూనిన సామినేని ఉదయభాను ఎన్నికల ఫలితాలు తర్వాత వైసీపీకి గుడ్ బై చెప్పేసారు. దాంతో నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, వస్తున్న మార్పులతో నియోజకవర్గానికి కొత్త నాయకుడు రాకపోతారా? అని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి.నియోజకవర్గంలో బలమైన నేతలుగా టీడీపీ నుంచి ఉన్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, జనసేన పార్టీలో జాయిన్ అయిన సామినేని ఉదయభాను లాంటి నేతలను ఎదుర్కోవాలంటే జగ్గయ్యపేట లాంటి నియోజకవర్గం లో అన్ని రకాలుగా బలమైన నాయకుడు అవసరమని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఉదయభాను జగ్గయ్యపేటలో కాంగ్రెస్ తరపున రెండు సార్లు, వైసీపీ నుంచి విజయం సాధించారు. శ్రీరాం తాతయ్య టీడీపీ అభ్యర్థిగా మూడో సారి గెలిచారు. అలాంటి లీడర్లు ఇద్దరు ఇప్పుడు మిత్రపక్షాల్లో ఉండటంతో వైసీపీకి సమర్ధుడైన నేతను వెతకడం కత్తి మీద సామే అంటున్నారు.సామినేని ఉదయభాను పార్టీ మారినా క్యాడర్ మాత్రం వైసీపీని వదలలేదని లీడర్ గురించి క్యాడర్ వెనకడుగు వేయాల్సిన అవసరం లేదని అ పార్టీ శ్రేణులు అంటున్నాయి. అదేమంటే గత ఎన్నికల్లో కూటమి వేవ్‌లో సైతం వైసీపీ 52 వేల ఓట్లు దక్కించుకుని 16 వేల ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని ధీమా వ్యక్తం చేస్తున్నాయి . అంత వరకు బానే ఉన్నా సామినేని ఉదయభాను పార్టీని వీడగానే ఆయన ప్రధాన అనుచరుడు కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ అయిన తన్నీరు నాగేశ్వరావు కు తాత్కాలికంగా జగ్గయ్యపేట నియోజకవర్గం ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. శ్రీరామ్ తాతయ్య, సామినేని ఉదయభాను లాంటి నేతలను ఎదుర్కోవడానికి ఆయన సరిపోరన్న అభిప్రాయం వ్యక్తం అవుతుందిఅదలా ఉంటే మార్పులు చేర్పులతో జగ్గయ్యపేట నియోజకవర్గం రాజకీయం ఆసక్తిగా మారింది. శ్రీరాం తాతయ్య, సామినేని ఉదయభాను ఒకప్పుడు కాంగ్రెస్‌లో మిత్రులుగానే కొనసాగారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలుగా పని చేశారు. శ్రీరాం తాతయ్య రాష్ట్ర విభజన ఎఫెక్ట్‌తో టీడీపీలో చేరారు. సామినేని ఉదయభాను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగి అనంతరం వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరి అభ్యర్థిగా బరిలోకి తిరిగి రెండుసార్లు ఓటమి చెంది ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.ఇప్పుడు ఇద్దరూ కూటమి పార్టీల్లోనే ఉండటంతో రాజకీయ మిత్రులయ్యారు. వారిద్దరినీ ఎదుర్కొనేంత బలమైన నాయకుడిని జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎవరున్నారా అని వైసీపీ వెతుక్కునే పనిలో పడింది. ప్రస్తుతం జగ్గయ్యపేట వైసీపీలో కన్ఫ్యూజన్ నెలకొన్న పరిస్థితుల్లో కొత్త నాయకుడికి పగ్గాలు అప్పగించాలని, అన్ని విధాలా సమర్ధుడైన నాయకుడ్ని తెర మీదకు తీసుకు రావాలని వైసీపీ వర్గాలు ఆశిస్తున్నాయి. చూడాలి మరి అత్యంత కీలకమైన జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసీపీకి అంత బలం ఉన్న నాయకుడు ఎవరు దొరుకుతారో?

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com